# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త






## సామాన్య భక్తుడిలా చైర్మన్ బిఆర్‌నాయుడు భక్తులతో మాటామంతీ



తిరుమల, జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి: తనవెంట మందీ మార్బలాన్నిగానీ, తన వ్యక్తిగత సిబ్బందినీగానీ తీసుకెళ్ళడు....ఆయన సాదాసీదాగా సామాన్యభక్తుడిగా ఆదివారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు నాదనీరాజనం వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన భక్తులతో కలసిపోయి వారితో బాటే నేలపైనే కూర్చున్నారు. వేదికపై జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షిస్తూ ఓ భక్తుడిగా అక్కడే ఉన్న కొందరు భక్తులతో మాటలు కలిపాడు. వెంటనే సౌకర్యాలపై, టిటిడి సేవలపై, పరిశుభ్రతగురించి వాకబు చేశారు. భక్తులు కూడా లడ్డూప్రసాదాలు, అన్నప్రసాదాల రుచి, నాణ్యతగురించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుండి సహస్రదీపాలంకారసేవ జరిగే ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ ఆలయ అర్చకులతో కలసి మాఢవీధుల్లో మలయప్ప ఊరేగింపులో పాల్గొన్నారు.

## భక్తజన సేవకు సర్వం సిద్ధం

### ఉపకమీషనర్ ఏకాంబరం



బోయకొండ(చౌడేపల్లి), జనవరి 5 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో నిండిపోయింది. యాత్రీకుల వసతుల సమకూర్చేందుకు ప్రాధ్యానత ఇస్తామని ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం అన్నారు. కొండదినాన్ని పురష్కరించుకొని ఉదయాన్నే అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఆలయంలో భక్తులకు చేస్తున్న సేవలను ఇఓ ఏకాంబరం పర్యవేక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మూలస్థాన అమ్మవారి ఆలయంలో మరిన్ని సేవలు కల్పించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు వసతులను సమకూర్చారు.

# కుప్పంలో ఇక అభివృద్ధి పరుగులు ..

**- 1000కోట్లతో సోలార్ ప్రాజెక్టుకు శ్రీకారం .. స్వర్ణకుప్పం విజన్ 2029 ప్రారంభం !!**

**- 92కోట్లతో కుప్పం మున్సిపల్ అభివృద్ధి.. 34కోట్లతో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన !!**

కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త

35 ఏళ్లుగా తనను గెలిపిస్తూ వస్తున్న కుప్పం ప్రజల రుణం తీర్చుకునేదిశగా జననాయకులు, కుప్పం ముద్దుబిడ్డ నారా చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో కుప్పం నిలిచింది. దీంతో 2024 ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన అనంతరం సిఎం చంద్రబాబునాయుడు దేశంలోనే కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా మలిచే క్రమంలో స్వర్ణకుప్పం విజన్ 2029కు తన కుప్పం పర్యటనలో భాగంగా శ్రీకారం చుట్టనున్నారు. కుప్పంలోని ప్రతి కుటుంబంనుంచి ఓ పారి శ్రామికవేత్త రావాలనేది సిఎం చంద్రబాబు ఆలోచన. మరో పక్క మహిళలు ఆర్థిక ంగా తమకాళ్లపై తాము నిలబడేలా చూడాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. కుప్పం ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడిచే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన కుప్పం పర్యటనలో భాగంగా వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కుప్పం నియోజకవర్గంను పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా వందశాతం సోలరైజేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరవైశాతం వాటా భరిస్తే లబ్దిదారుడు మరో నలభైశాతం వ్యయం భరించాలి. అయితే కుప్పం నియోజకవర్గంలో లబ్దిదారుల తరపున 40శాతం వాటాను సైతం రాష్ట్ర ప్రభుత్వం భరి ంచేలా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారు. ఈ సోలార్ ప్రాజెక్ట్‌ను సిఎం చంద్రబాబునాయుడు సోమవారం కుప్పం మండలం నడిమూరులో శ్రీకారం చుడతారు. మరో పక్క దాదాపు 92.20కోట్ల రూపాయలతో కుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు మరో 34కోట్లతో రహదారుల నిర్మాణాలు చేపట్టే పనులకు సిఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్‌కెనాల్ లైనింగ్ పనులకు సిఎం చంద్రబాబు దాదాపు 500కోట్లు మంజూరు చేయగా ఆ పనులు సైతం త్వరలోనే ప్రారంభంకానున్నాయి. ఇదివరకే 20కోట్ల ఉపాధినిధులతో సిసిరోడ్లు, 50కోట్లతో గోకులంషెడ్ల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి.

**సమస్యలివీ సిఎం సారూ**

: కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ఏనుగుల దాడుల నిరోధానికి కౌండిన్య అభయారణ్యం చుట్టూ సోలార్ ఫెన్సింగ్‌తో పాటు కందకాల నిర్మాణాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గుడుపల్లె మండలంలోని చిగురుగుంట బంగారు గనులు ప్రారంభం అయితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. అదేవిధంగా కుప్పంలో ఎన్టీఆర్ సుజల శుద్ధ జలాల పంపిణీకి సిఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటారని ప్రజలు కోరుతున్నారు. కుప్పం ప్రధాన రహదారి విస్తరణతో పాటు పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు పనులు కూడా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## నేటినుంచి సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన



కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈనెల 6,7,8 తేదీల్లో పర్యటించనున్నారు. సిఎం కుప్పం పర్యటనకు సంబంధించి వివరాలిలా.. 6వతేది ఉదయం 12 గంటలకు సిఎం చంద్రబాబునాయుడు బెంగళూరు నుంచి ద్రవిడ వర్సిటీకి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. 12గంటలనుంచి 1.15గంటల వరకు ద్రవిడ వర్సిటీ ఆడిటోరియంలో స్వర్ణకుప్పం విజన్ 2029ను ఆవిష్కరించిన అనంతరం చర్చా వేదిక నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.25గంటలకు కుప్పం మండలం నడిమూరుకు చేరుకుని అక్కడ సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ ప్రాజెక్టను ప్రారంభించి లబ్దిదారులతో మాట్లాడతారు. సాయంత్రం 4గంటలకు మున్సిపల్ పరిధి చీగలపల్లి చేరుకుని అక్కడ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలనుంచి 7.45 గంటల దాకా ద్రవిడ వర్సిటీ ఆడిటోరియంలో ముఖ్య నేతలతో సమావేశమవుతారు. రాత్రి బసకు కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. 7వతేది కుప్పం టిడిపి కార్యాలయం వద్ద ఉదయం ప్రజలనుంచి వినతుల స్వీకరణ, కుప్పం పార్టీ కార్యాలయంలో జననాయకుడు గ్రీవెన్స్ సెల్‌ను సిఎం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.20గంటలకు కంగుంది గ్రామం చేరుకుని అక్కడ దివంగత పిఆర్ శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం 1.20గంటలకు కుప్పం ఎన్టీఆర్ స్టేడియం చేరుకుని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5గంటలకు కడపల్లి గ్రామం చేరుకుని నిర్మాణంలో ఉన్న సొంతింటి నిర్మాణ పనులు పరిశీలిస్తారు. అక్కడనుంచి సాయంత్రం 6.10గంటలకు ద్రవిడ వర్సిటీ చేరుకుని అక్కడ అకడమిక్ భవనాలు, వన్‌ఎంవన్‌బి కెరీర్ రెడినెస్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి రాత్రికి కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. 8న ఉదయం ద్రవిడ వర్సిటీనుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి వైజాగ్‌కు పయనమవుతారు.

## పార్మసీ కంపెనీలో గ్యాస్ లీక్

**20మందికి అస్వస్థత.. గోప్యంగా వుంచిన యాజమాన్యం**

**బాధితుల ఆందోళన**





అన్నాగౌరి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నార్త్ ఇండియాకు చెందిన కార్మికులు

నారాయణవనం, జనవరి 5 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండల పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న పార్మసీ కంపెనీలో శనివారం గ్యాస్ లీక్ కావడంతో సుమారు 20మంది అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంపెనీలో గ్యాస్ లీక్ అయిన విషయాన్ని కంపెనీ యాజమాన్యం గోప్యంగా వుంచింది. కనీసం మీడియా ప్రతినిధులు కంపెనీ వద్దకు వెళ్లి సమాచారం కోసం వెళ్లిన అనుమతి ఇవ్వలేదు. ఈ పార్మసీ కంపెనీని ఐదు నెలల క్రితమే ప్రారంభించారు. పార్మసీ కంపెనీని ప్రారంభించే సమయంలోను గోప్యతను పాటించి ప్రారంభించారు. కనీసం కంపెనీ నిబంధనల మేరకు అనుమతులు తీసుకున్నారా?లేదా? అనే అనుమానం కలుగుతోంది. అధికారులను తమ చేతుల్లో పెట్టుకొని నిబందనలకు విరుద్దంగా ప్రారంభించారనే అనుమానాన్ని స్థానికులు వ్యక్త పరుస్తున్నారు. పూర్తి స్థాయిలో కంపెనీ నిర్మాణ పనులు పూర్తి కాకముందే ఎలా కార్మికులను పెట్టుకొని ఉత్పత్తి చేస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడుతున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో సుమానే 20మంది వరకు గాయపడ్డారు. వీరిలో 10మందిని పుత్తూరు మండలం వేపగుంట సమీపంలోని అన్నాగౌరి ఆస్పత్రిలో గోప్యంగా చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన 10మందికి ఎక్కడ చికిత్స అందిస్తున్నారో సమాచారం లేదు. యాజమాన్యంను వివరణ కోరగా సమాదానం దాట వేస్తున్నారు. చివరకు సరైనా సమాదానం చెప్పడం లేదని సిపిఎం, సిపిఐ నేతలు మండి పడుతున్నారు. గాయపడ్డ వారందరు నార్త్ ఇండియా నుంచి పొట్ట కూటి కోసం వచ్చిన వారే. చివరకు బాధిత కుటుంబాలకు కూడా సమాచారం అందించకపోవడ పట్ల యాజమాన్య ం తీరుపై మండిపడుతున్నారు. త్వరలోనే కంపెనీ ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. జిల్లా ఉన్నత అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న కెఎస్ ఆర్టీసీ

**- 30 మంది ఓం శక్తి భక్తులకు గాయాలు**





బంగారుపాళ్యం, జనవరి 5 ప్రభాతవార్త:

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 30 మంది ఓంశక్తి భక్తులు గాయపడ్డారు. వీరిలో 26 మంది స్వల్పంగా గాయపడగా నలుగురు తీవ్రంగా గాయలకు గురయ్యారు. ఎఎస్ఐ మల్లప్ప వెల్లడించిన వివరాల మేరకు కర్నాటక రాష్ట్రం చింతామణి నుండి తమిళనాడు మేల్‌మరవత్తూరు ఓంశక్తి ఆలయానికి ఆదివారం ఉదయం 8 గంటలకు కెఎస్ అర్టీసీలో భక్తులు బయలుదేరారు. మార్గమధ్యంలో ఆల్పహారం భుజించిన భక్తులు తిరిగి బస్సులో ప్రయాణిస్తుండగా మొగిలి ఘాట్ వద్ద ముందు వెళ్తున్న ఈచర్ వాహనంను బస్సు ఢీకొంది. రోడ్డు ప్రక్కన వున్న డివైడర్‌పై బస్సు దూసుకుపోవడంతో బస్సులో వున్న ఓంశక్తి భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో చింతామణికి చెందిన నిర్మల(57), పద్మమ్మ(52), రత్నమ్మ(45), సుమిత్ర(38), రక్ష(4), సరోజమ్మ(58), మునియమ్మ(50), సునంద(26), రాణి(30), మాధవి(43), భాగ్యమ్మ(39), రూప(30), మునస్వామిరెడ్డి(50), జ్యోతి(39), వరలక్ష్మీ(40), గంగాధర్(32), నందిని(37), పద్మ(40), మంజుల(45), పద్మావతి(40), నాగరత్న(55), మనోజ్(10), శరవణమ్మ(30), అమరావతి(50), మునెమ్మ(58), నాగరత్న(60)లు గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను 108 వాప న్లానాల్లో చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు

## వరిలో అగ్గితెగులు ...

**అవస్థలు పడుతున్న అన్నదాతలు ...**

నాయుడుపేట జనవరి 5 ప్రభాతవార్త



గ్రామాల్లో రైతులు ఆరుగాలం కష్టపడి వేలకువేలు అప్పులు చేసి సాగుచేపట్టిన వరిపైరులో ఒక్కసారిగా అగ్గితెగులు సోకడంతో అన్నధాతలు అవస్థలు పడుతున్నారు. నాయుడుపేట మండలంలో రైతులు 9950 ఎకరాల్లో వరిపైరును సాగు చేపడుతు న్నారు. అందులో ముఖ్యంగా రైతులు బిపిటి జిలకర మసోర, కెఎన్‌ఎమ్, ఆఎన్‌ఆర్‌లు, తదితర రకాల పంటలను సాగుచేపట్టారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈఏడాది అధిక వర్షపాతాలు నమోదు కావడంతో స్వర్ణముఖి-మామిడికాలు పరివాహక గ్రామాల్లో వరిపంట వరద ప్రవాహానికిగురై నీటమునిగి పూర్తిగా దెబ్బతింది. ఇప్పుడిప్పుడే వరిపైరు కోలుకోని ఏపుగా వస్తున్న సమయంలో అగ్గితెగులు సోకడంతో అన్నధాతల కష్టాలు వర్ణాతీత్తంగా మారుతున్నాయి. అగ్గితెగులు నివారణకు మందులషాపుల్లో ఇచ్చిన మందులు వాడిన తెగులు మాత్రం నివారణ కావడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్‌ను వివరణ కోరగా ఆయన మాట్లడుతూ గతకొద్ది రోజుల నుండి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదుకావడం, పొగమంచు విపరీతంగా కురవడం, రైతులు యూరియాను అధికంగా వాడటం కారణంగా వరిలో అగ్గితెగులు సోకేఅవకాశం అధికంగా ఉందన్నారు. దీని నివారణకు రైతులు యూరియా శాతం పూర్తిగా తగ్గించాలన్నారు. ట్రైసైక్లోజోన్ 120గ్రాములు ఒక ఎకరానికి, పిజివన్, గెలిలీయోసెన్స్‌ను తగిన మోతాదులో కలిపి పిచికారి చేయడం ద్వార అగ్గితెగులును పూర్తిగా నివారించవచ్చునని ఆయన సూచించారు.

## వైకుంఠ దర్శన టోకెన్లకు సర్వంసిద్ధం

**-9న ఉదయం నుండి జారీ -భక్తులకు సకల సౌకర్యాలు**



తిరుమల, జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలేశుని ఆలయంలో 10వతేదీ రానున్న శుక్రవారం తెల్లవారుజామున తెరచుకోనున్న పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి టిటిడి ఏర్పాట్లు పూరి ్తచేసింది. పదిరోజులకు సంబంధించిన ఈ టోకెన్లను 9వతేదీ ఉదయం 5గంటల నుండి తిరుపతిలో 87 కౌంటర్లలో జారీ చేస్తారు. ఇందుకోసం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్, రామచంద్రపుష్కరిణి, ఇందిరామైదానం, జీవకోనలోని జడ్పీ ఉన్నతపాఠశాల, బైరాగిపట్టెలోని రామానాయుడు ఉన్నతపాఠశాల, ఎంఆర్‌పల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచితంగా టోకెన్లు ఇవ్వనున్నారు. ఈ టోకెన్లను అందుకోవడానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున టిటిడి, పోలీసు, విజిలెన్స్‌సంయుక్తంగా అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులు ఆధార్‌కార్డులు తీసుకుని క్యూలైన్లలో నిలబడితే వారి వరుసవచ్చిన వెంటనే టోకెన్ అందుకోవాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కోరారు. తిరుమలలో దర్శన ఏర్పాట్లు, సౌకర్యాలపై ఆదివారం ఉదయం ఆయన తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు. జనవరి 10,11,12తేదీలకు మూడురోజులకు సంబంధించి 9వతేదీనే 1.20లక్షల టోకెన్లు ఒకేసారి జారీ చేస్తారని, మిగిలిన ఏడురోజులకు సంబంధించి ఏ రోజుకా ముందురోజు టోకెన్లను ఇస్తారని ఆయన తెలిపారు.

## 'జనం'లో లేని సేనానిలు !

**సమస్యలపై మొర వినేవారెవరు?**



ప్రభాతవార్త-తిరుపతి:

"ఇంటగెలచి రచ్చగెలవమన్నారు పెద్దలు"ఇందుకు భిన్నంగా తిరుపతి నియోజకవర్గంలోజనసేన పార్టీ నేతల తీరు తయారైంది. గత ఏడాది ఎన్నికల్లో కూటమి పార్టీల ఒప్పందంలో తిరుపతి టిక్కెట్ జనసేనపార్టీకి కేటాయించడం, ఇక్కడ ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులును జనం గెలిపించుకోవడం విదితమే. ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తూ ఎనిమిదినెలలు కావస్తున్నా జనం మధ్య ఉన్న రోజులు చాలా తక్కువేనని చెప్పుకోవచ్చు. పైగా నగరంలోని పలు డివిజన్లలో జనం ఎదుర్కొంటున్న కనీస సమస్యలపై మొర వినిపించుకునేవారే లేకపోగా సిట్టింగ్ ఎంఎల్ఎ కనీసం వారంలో ఒక డివిజన్‌లో కూడా పర్యటించ లేకపోవడం, జనం వద్దకు వచ్చే తీరికకూడా లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవ్వడం వరకే పరిమితమై పోయారనేది సొంత పార్టీలోనే గుసగుసలు. ఇందుకు నిదర్శనమే ప్రతిసోమవారం తిరుపతి నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి తిరుపతి జనం నుండి సమస్యలు ,ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పెద్దసంఖ్యలోనే సమస్యలపై ఆర్జీలు ,ఫోన్‌ద్వారా తమ గళం వినిపించుకునే పరిస్థితి ఉంది. కొన్ని కాలనీల్లో తాగునీటి సమస్య ఎదురవుతుండగా ,మరికొన్ని కొన్ని కాలనీల్లో డ్రైనేజీ సమస్యలతో అక్కడి జనం సతమతమవుతున్నారు. ఇవేమీ తమకు పట్టనట్లు నాయకులు వారివారి పనులు చక్కబెట్టుకోవడమే ప్రధానంగా సమయం గడిపేస్తున్నారనేది నగరజనంలో వినిపిస్తోంది. జనసేనాని ,అధినేత పవన్‌కల్యాణ్ జనం కోసం చేస్తున్న కృషి కూడా ఇక్కడ నేతలు చేయడంలేదంటే అతిశయోక్తికాదు. అలాంటిది ఇప్పుడు తిరుపతిలో నగరపాలక కౌన్సిల్‌లో కార్పొరేటర్లు కూడా తాము ప్రాతినిథ్యం వహిస్తున్న డివిజన్లలో జనం సమస్యలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగానే ఉన్నాయి. కొందరు కార్పొరేటర్లు తాము చెప్పిన సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదనే అసహనం వ్యక్తం చేస్తుండటం మరీ విశేషం. ఈ నేపథ్యంలో తిరుపతిలో జనసేనపార్టీకి చెందిన జనసేనానీలను వ్రేళ్ళపై లెక్కపెట్టొచ్చు. గత ఎన్నికల సమయంలో కొందరు పార్టీ మారి జనసేనా కండువా వేసుకున్నారు. అలాంటి నేతలు ఐదారుగురు వరకు ఎంఎల్ఎ చెంత చేరడం, తమ మాటలతో సమయం గడిపి తమ పనులు చక్కబెట్టుకోవడం వరకే సరిపోతోందని జనం విరుచుకుపడుతున్నారు. ఇప్పటికీ తిరుపతిలో వృద్ధాప్య ఫించన్లు రావడం లేదని, రేషన్‌కార్డులు లేవని, సొంత ఇళ్ళు లేవని, స్థలాలు ఆక్రమణలు, భూ కబ్జాలపై ఫిర్యాదులు చేస్తున్నా కనీసం కనికరించే నాయకుడు లేరని వాపోతున్నారు. తిరుపతి నియోజకవర్గంలో జనసేనపార్టీకి చెందిన ముగ్గురు నలుగురు కీలక నేతలు క్రియాశీలకంగా ఉంటున్నా ఆ కొందరు కూడా జనంలో లేకపోతుండటం , జనానికి ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారు. ఈ నేతలు కూడా స్థానిక ప్రజాప్రతినిధిని ఉదయం కలసి హాజరు వేసుకోవడం మాత్రమేనని అంటున్నారు. జనసేనపార్టీ తిరుపతిలో గెలవడం టిడిపి మద్దతుతోనేననేది తెలిసిన వాస్తవం. అలాంటిది జనం సమస్యలు తెలుసుకునేందుకు డివిజన్లలో పర్యటించే సమయం లేకపోవడం రానున్న రోజుల్లో ఆ పార్టీ పరిస్థితి ఎక్కడకు దారితీస్తుందో కాలం నిర్ణయించనుంది.

## సందడి చేస్తున్నాం.. పండగ ఎప్పుడు చేస్తారు







తడ, జనవరి 5 ప్రభాతవార్త

'శీతాకాలం వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో ముగిసిపోనుంది. పులికాట్ సరస్సు, నేలపట్టు చెరువులకు మేము వచ్చేసి చాలా రోజులయింది. పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తున్నాం. మరి మీరు పండగ ఎప్పుడు చేస్తారు'.. అంటూ వలస విహంగాలు అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తొలి శీతాకాల సమయంలోనే ఫ్లెమింగో ఫెస్టివల్ జరపడానికి ఉత్సాహం చూపించింది. 2001లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలిస్తున్నప్పుడే ఈ పక్షుల పండగ ప్రారంభమయింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ ప్రకృతి ప్రేమికుడు కావడంతో ఈ ప్రాంతం పర్యాటకులతో కళకళలాడాలని ప్రభుత్వాన్ని ఒప్పించి ఫ్లెమింగో ఫెస్టివల్ జరిపించారు. ఏటా క్రమం తప్పకుండా కొన్నేళ్ల పాటు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వాలు మారినా సూళ్లూరుపేట కేంద్రంగా నేలపట్టు, పులికాట్‌లు ముఖ్య సందర్శన క్షేత్రాలుగా ఈ పండగ జరిపించారు. పండగ జరిగే రోజుల్లో ఎందరెందరో మేధావులు, రాజకీయ ప్రముఖులు, ప్రజ్ఞావంతులయిన కళాకారులు, శాస్త్రవేత్తలు, రాష్ట్రస్థాయి అధికారులు, మంత్రులు కూడా ఇక్కడికి రావడం మొదలయింది. పక్షుల కేంద్రాలకు క్రమేణా సందర్శకుల రాక ఈ ప్రాంతంలో వ్యాపారాలు కళకళలాడటానికి కారణమయింది. పైగా ఈ పండగ పేరుతో కొన్నిచోట్ల అభివృద్ధి కార్యక్రమాలు విరివిగా చేపట్టే అవకాశం లభించింది. తాము వెళితే గాని తమ దగ్గరకు రాని ఉన్నతాధికారులు, మంత్రులను నేరుగా కలిసి సమస్యలను విజ్ఞాపనల రూపంలో తెలియజేసే మహదవకాశం ఈ ప్రాంతానికి చెందిన గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, ప్రజలకు దక్కింది. దీనికితోడు ఇక్కడ పర్యటించిన విజ్ఞానుల కాలుమోపిన శుభవేళ ఏమో గాని ఎంతో వెనుకబడిన తమిళనాడు సరిహద్దు తీరప్రాంతం ఎక్కువగా విస్తరించిన సూళ్లూరుపేట ప్రాంతంలో విరివిగా పరిశ్రమలు వచ్చాయి. స్థిరాస్తి వ్యాపారం అభివృద్ధి చెందింది. ఉత్తమ భారతం నుంచి కూడా వేలాది మంది కార్మికులు ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తూ స్థానికంగా కూడా వ్యాపార అభివృద్ధికి దోహదం చేసింది. ఈ నేపథ్యాన తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి అధికారంలోకి వచ్చింది.

**ఇంకా ఖరారుకాని ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు**

**కోవిడ్ ఫెస్టివల్‌నూ తాకింది**

కోవిడ్ మహమ్మారి కారణంగా కొన్నేళ్ల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ జరపలేకపోయారు. అయితే తాము ప్రారంభించిన ఈ పండగను మళ్లీ అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు ముందుకొచ్చారు. సూళ్లూరుపేట తొలి మహిళా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో తిరుపతి జిల్లా అధికారులు ఈ పండగపై ఉత్సాహం చూపించారు. ముఖ్యంగా ప్రస్తుత కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పలుమార్లు ఈ ప్రాంతానికి రావడం, పక్షుల కేంద్రాలను సందర్శించడం, స్థానిక అధికారులకు సూచనలివ్వడం నెలన్నర రోజుల ముందే మొదలయింది. జిల్లా కేంద్రంగా కూడా ఆయన వివిధ శాఖల అధికారులు, కీలక ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశాలు జరిపారు.

**ఈ నెలలోనే ఉంటుందా?**

ఫిబ్రవరి నెల అంటే ఎండలు ముదిరి పక్షులు తిరిగి తమ తమ దేశాలకు ఎగిరి వెళ్లిపోతాయని, జనవరిలోనే పండగ జరపాలని జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముందుగా అనుకున్నట్లుగానే సూళ్లూరుపేట ప్రధాన కేంద్రంగా నేలపట్టు, అటకానితిప్ప, తడ మండలం భీములవారిపాలెం, శ్రీసిటీలు కూడా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణ కేంద్రాలుగా పండగ జరపడానికి ముందుకు వచ్చినట్లు తెలిసింది. నెలాఖరుకన్నా ముందే పక్షుల పండుగ జరపనున్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వ విప్ డా॥కంచర్ల శ్రీకాంత్‌చే టిఎన్‌టియుసి కేలండర్ల ఆవిష్కరణ

కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త




తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నూతన సంవత్సర కేలండర్లను ఆదివారం స్థానిక చంద్రన్న కార్మిక భవనంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక లోకానికి సిఎం చంద్రబాబునాయుడు అండగా ఉంటారన్నారు. కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ దాము, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, సంఘ అధ్యక్షుడు శివకుమార్, సంఘ నేతలు హరి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు పర్యటన జయప్రదం చేయాలి

**- ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం**
**- 7న కంగుందిలో సిఎంచే పిఆర్ శ్యామన్న విగ్రహావిష్కరణ !!**

కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు రెండు రోజుల కుప్పం పర్యటనను జయప్రదం చేయాలని ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం కంగుందిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల పర్యటనలో సిఎం చంద్రబాబు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారన్నారు. మారుమూల గ్రామాలకు సైతం సౌర విద్యుత్ పథకం అమలుకు కుప్పం నుంచే బీజం వేయనున్నట్లు చెప్పారు. ఈనెల 7వతేది కంగుంది గ్రామంలో గ్రామ మార్గదర్శి, మాజీ సర్పంచ్ దివంగత పిఆర్ శ్యామన్న విగ్రహంను సిఎం చంద్రబాబు ఆవిష్కరిస్తారన్నారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన శ్యామన్నకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఎన్నో గ్రామాల్లో ఆయన సేవా కార్యక్రమాలు చేపట్టారని, గ్రామాల అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ముప్పై ఏళ్లపాటు సర్పంచ్‌గా కొనసాగి అంటరానితనాన్ని రూపుమాపేందుకు అందరూ ఒక్కటే నినాదంతో ప్రజలను ఏకం చేశారన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహం తన చేతుల మీదుగా ఆవిష్కరించేందుకు సిఎం చంద్రబాబు తమ గ్రామానికి రానుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సిఎం చంద్రబాబు పిఎ మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, సర్పంచ్ ధనశేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు బిఎంకె రవిచంద్ర, విసి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుడిపై దాడి చేసిన ఆవు.. స్వల్పగాయాలతో బాలుడు క్షేమం

కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త



కుప్పం పట్టణం ఆక్సిస్ బ్యాంక్ సర్కిల్ సమీపంలో ఆదివారం ఉదయం ఓ ఆవు ఓ బాలుడిపై దాడి చేసి గాయపరచింది. అంతలో అక్కడున్న స్థానికులు ఆవును బెదరగొట్టడంతో అది వెళ్లిపోయింది. దీంతో బాలుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సాత్విక్ అనే బాలుడు రోడ్డులో వస్తుండగా అటుగా వస్తున్న ఓ పెద్ద ఆవు బాలుడిపై దాడికి దిగింది. దీంతో అతని పొట్టభాగంలో గాయం అయింది. ఇది గమనించిన స్థానికులు ఆవును చెదరగొట్టారు. అనంతరం గాయపడ్డ బాలుడికి స్థానికులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. కాగా పట్టణంలో పలువురు ఆవులను యధేచ్ఛగా రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఈ ఆవులు ఇటీవలి కాలంలో మనుషులపై దాడులకు దిగి పొడిచేందుకు వస్తున్నాయని జనం వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇలా రోడ్లపై ఆవులను వదిలే వాటి యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి ముందుందు ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వార్త ప్రభావం

### కుప్పం అర్బన్ సిఐగా శంకరయ్య బాధ్యతలు

కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త



కుప్పం అర్బన్ సిఐగా పి. శంకరయ్యను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అర్బన్ సిఐగా శంకరయ్య బాధ్యతలు చేపట్టారు. అర్బన్ సిఐ శంకరయ్య అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. గురువారం 'వార్త'లో ఆ స్టేషన్‌కు ట్రిబుల్‌స్టార్.. డబుల్‌స్టార్ అధికారులు కావలెను అనే కథనం వెలువడిన విషయం విదితమే. ఈ కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు కుప్పంలో సిఎం చంద్రబాబు నాయుడు పర్యటన కూడా ఉన్న నేపథ్యంలో అర్బన్ సిఐను హుటాహుటిన నియమించారు.

## గృహ నిర్మాణాల ప్రక్రియ హౌసింగ్ శాఖకు అప్పగిస్తే సౌకర్యం

పూతలపట్టు, జనవరి 5, ప్రభాతవార్త



సచివాలయ వ్యవస్థ నుంచి గృహ నిర్మాణ శాఖను మినహాయింపు కలిగించాలని కూటమి ప్రభుత్వం పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో అర్హులను, బిల్లులను హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్, ఏఈ పర్యవేక్షిస్తున్నారు. కానీ సచివాలయం వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ పనులు కూడా ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇవ్వడం వల్ల ఏ పని చేయాలో అర్థం కాక మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు కొత్తగా కూటమి ప్రభుత్వ వచ్చాక పిఎంఏవై 2.0 ఆన్లైన్ నందు డేటా ఏంటి చేయమంటే వాళ్ళకి రకాల సర్వేలు ఇవ్వడం వల్ల గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనుక వీటిని దృష్టిలో పెట్టుకొని గతంలో ఏ విధంగా లబ్ధిదారుల ఎంపిక వర్క్ ఇన్స్పెక్టర్లు, ఏఈలకే బాధ్యతలు అప్పగించాలని పలువురు సూచిస్తున్నారు. బిల్లుల విషయంలోనూ రిపోర్ట్ ఇచ్చే విషయంలోనూ గృహ నిర్మాణ శాఖ ఏఈలు మీటింగ్ అప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒక మండలంలో 19 సచివాలయాలు ఉంటే అందులో ఏ ఒక సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాకపోయినా పూర్తిగా వారికి రిపోర్ట్ ఇవ్వలేని పరిస్థితి కనుక వీటిని దృష్టిలో పెట్టుకొని గతంలో లానే ఆ శాఖకు పూర్తిగా అధికారాలు ఇవ్వాలని కోరుతున్నారు.=

## గోవిందుని నామం మధురం...దర్శనం మధురాది మధురం...!



**చౌడేపల్లి, జనవరి 5 ప్రభాతవార్త** గోవిందా నీ నామం మధురం నీ దర్శనం మధురాది మధురం... అంటూ వెంకన్న భక్తులు పాదయాత్ర చేపట్టారు. మండలం నుంచి దాదాపు 250మంది గోవిందస్వామి భక్తులు ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని కాలినడకన తిరుమలకు బయలుదేరారు. అగ్రహారం ఆనంద స్వామి ఆధ్వర్యంలో దుర్గసముద్రం, చారాల, ఎ.కొత్తకోట తదితర ప్రాంతాల భక్తులు తెల్లవారు జామునే చౌడేపల్లికి చేరుకొని ఇక్కడి నుంచి గోవింద నామస్మరణతో తిరుమలకు పాదయాత్ర ద్వారా వెళ్ళారు.

## పార్టీలు మారిన నాయకులు పదవులకు రాజీనామా చేయాలి: సలీం బాషా



**రొంపిచెర్ల, జనవరి 5, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పార్టీలు మారిన వైఎస్‌ఆర్సీపీ నాయకులు వారి పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలని వైఎస్‌ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం రొంపిచెర్లలో స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలో కొనసాగడం మంచిది కాదన్నారు. పార్టీ మారిన నాయకులు పదవులు కొనసాగే అర్హత లేదన్నారు. వెంటనే పదవులకు రాజీనామా చేసి ఇతర పార్టీలలోనే కొనసాగ వచ్చున్నారు. తల్లి లాంటి పార్టీని వెన్నుపోటు పొడిచిన నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు వెంకట మిథున్ రెడ్డి కార్యకర్తలకు ఎలాంటి కష్టాలు వచ్చినా అండగా ఉన్నారని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్సీపీ నాయకులు గాలేటి జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ



**రొంపిచెర్ల, జనవరి 5, ప్రభాత వార్త:** దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన వీల్ చైర్లు, వినికిడి యంత్రాలను, సంక కర్రలను పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి చల్లా రామచంద్రా రెడ్డి ఆదివారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీను, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఇర్షాద్ లు మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వివాహాలు చేసుకునే దివ్యాంగులకు రూ. 1.50 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలన్నారు. అలాగే దివ్యాంగులను వివాహం చేసుకునే వారికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం మంజూరు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. 2016లో అమలు చేసిన దివ్యాంగుల చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. అనంతరం దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని చల్లా రామచంద్రా రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మదలీ, కార్యవర్గ సభ్యులు అబ్దుల్ రెహమాన్, దిలీప్, వాసు బావాజాన్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేనలోకి భారీ చేరికలు

పుంగనూరు, జనవరి 5 ప్రభాతవార్త



మండలంలోని బండ్లపల్లి, నెక్కుంది కొత్తకోట పంచాయతీలో దాదాపుగా 500 పైగా కార్యకర్తలు ఇతర పార్టీల నుంచి నియోజకవర్గ జనసేన నాయకులు వేణు గోపాల్‌రెడ్డి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. తరువాత నల్లూరి పల్లి గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తను పుట్టిన ఊరు నల్లూరి పల్లిలో తనకు పంచాయతీలోని ప్రజలు ఘనంగా స్వాగతం పలకడం నాకు ఎంతో గర్వకారణంగా వుందన్నారు, జీవితకాలం బండ్లపల్లె, నల్లూరి పల్లి పరిసర పంచాయతీలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. అంతే కాకుండా బండ్లపల్లి ఉప సర్పంచ్ కలామందిర్ రెడ్డెప్ప రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి సమక్షం లో జనసేన పార్టీ లో చేరారు .కార్యక్రమంలో జనసేన నాయకులు శివ కుమార్ రెడ్డి, విరూపాక్ష, పగడాల రమణ, చిన్నా రాయల్, నరేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, రాఘవ, నరేష్ రాయల్, చైతన్య రాయల్, కుమార్‌రాయల్, శంకర్‌రెడ్డి, పాములహరి, వెంకటరెడ్డి, జనసేననాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మళ్ళీ ఇసుక అక్రమ రవాణా ప్రారంభం

పాలసముద్రం, జనవరి 5 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం నుండి సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడుకు మళ్ళీ ఇసుక అక్రమ రవాణా ప్రారంభమైంది. గత కొన్ని రోజులుగా సద్దుమణిగి వున్న ఇసుక అక్రమార్కులు మళ్ళీ అధికారులను సర్దుబాటు చేసుకుని తమ ఇసుక అక్రమ రవాణా దందాను పునఃప్రారంభించారు. ఇసుక అక్రమ రవాణాపై పత్రికల్లో పలు వార్త కథనాలు ప్రచురితం కావడంతో మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాలసముద్రం మండలం నుండి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై దృష్టి కేంద్రీకరించారు. అధికారుల మొత్తం దృష్టి పాలసముద్రం మండలంపై కేంద్రీకరించడంతో ఇసుక రవాణా అక్రమార్కులు ఇది సమయం కాదని కొంతకాలం మిన్నకుండిపోయారు. ప్రస్తుతం అధికారులు మళ్ళీ అప్రమత్తతను సడలించడంతో ఇసుక అక్రమార్కులు రంగంలోకి దిగి వనదుర్గాపురం మీదుగా మండలం నుండి భారీగా తమిళనాడు రాష్ట్రానికి ఇసుక అక్రమంగా తరలించడానికి సిద్ధం అయ్యారు. వనదుర్గాపురం గ్రామం మీదుగా సులభంగా తమిళనాడు రాష్ట్రానికి వెళ్ళడానికి దారులు వుండటంతో ఈ దారులను ఉపయోగించుకుని ఇసుక అక్రమార్కులు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. గంగాధరనెల్లూరు నీవా నది నుండి ట్రాక్టర్లు, లారీలు పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం అటవీ రహదారి గుండా వచ్చి అత్తిమంజేరి పేట ధర్మరాజుల గుడి వైపు వెళ్ళు మార్గం గుండి ఇసుకను అక్రమార్కులు తరలించుకెళ్లిపోతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఎవరు ఫిర్యాదు చేయకపోవడంతో వీరు తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఒక రోజులో లక్షల రూపాయల విలువైన ఇసుక అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి తరలివెళ్ళిపోతున్నది. ప్రభుత్వం ఉచితంగా ఇసుక లభ్యం అవుతుందని పేర్కొంటున్నప్పటికీ మండల ప్రజలకు ఎక్కడ ఉచిత ఇసుక లభ్యం కాలేదు. అయితే మండలం మీదుగా తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలించి కొంతమంది లక్షల రూపాయల ఆర్జిస్తున్నారు. మండలం నుండి జిడినెల్లూరు మండలం నీవానది నుండి ఇసుక అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి అక్రమార్కులు ఎలా తరలిస్తున్నారనే విషయంపై ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ లిబర్టీస్ అండ్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుప్రసాద్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇకనైనా జిల్లా, నియోజకవర్గ, మండల, పంచాయతీ స్థాయి అధికారులు మండలం నుండి అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి ఇసుక తరలివెళ్ళకుండా పక్కాగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను ఈ వారం కలెక్టర్ సుమిత్‌కుమార్ రద్దు చేశారు. కుప్పంలో సిఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం పర్యటించనుండటంతో జిల్లా అధికారులందరు సిఎం నారా చంద్రబాబునాయుడు పర్యటనలో పాల్గొనడానికి తరలివెళ్ళడంతో ఈ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఎవ్వరు సోమవారం సమస్యలపై అర్జీలు తీసుకుని కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ కోరారు.

## పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ రద్దు

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించే పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమంను ఈ వారం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. సిఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం కుప్పంలో పర్యటించనుండటంతో పోలీసు అధికారులు బందోబస్తు నిమిత్తం తరలి వెళ్ళడంతో పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమంను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రజలు ఎవ్వరు సోమవారం సమస్యలపై అర్జీలు తీసుకుని జిల్లా పాత పోలీసు కార్యాలయానికి రావద్దని ఎస్పీ కోరారు.

## లక్ష్మీదేవికి పిహెచ్‌డి ప్రదానం



చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:

సవిత ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెన్స్ బి.లక్ష్మీదేవికి పిహెచ్‌డి ప్రదానం చేసింది. బి.లక్ష్మీదేవి టమోటా ప్లాంట్ డిసీజెస్ ప్రిడిక్షన్ సిస్టం యూసింగ్ న్యూ ఫ్రేమ్ వర్క్ ఎస్ఎస్ఎంఎఎన్, ఎస్ఎస్ఎంఐఎన్ విత్ డిప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై రీసెర్చ్ చేసి ఎస్ఐఎంఎటిఎస్ ఇంజనీరింగ్, ఎస్ఐఎంఎటిఎస్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రిడిక్టివ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ శరవణన్ ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ మేరకు బి.లక్ష్మీదేవికి పిహెచ్‌డిని యూనివర్సిటీ ప్రదానం చేసింది.

## వరసిద్దుని దర్శించుకున్న మడకశిర, పూతలపట్టు ఎమ్మెల్యేలు

కాణిపాకం, జనవరి 5 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని ఆదివారం పలువురు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. ఈమేరకు మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు ఎంఎస్.రాజు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌తో కలసి కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏ ఈఓ రవీంద్రబాబు, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, ఎస్సై ధరణీధర, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి అపూహ్య స్పందన

కాణిపాకం, జనవరి 5 ప్రభాతవార్త



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం వద్ద ఆదివారం శ్రీవాణి చారిటబుల్ ట్రస్ట్, చిత్తూరు వారి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కాణిపాకం ఆలయ సందర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం సాధారణ శారీరక సమస్యలతో పాటు, దంత సమస్యలకు కాణిపాకం ఆర్టీసీ బస్టాండ్ నందు ఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులుకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈకార్యమ్రంలో కాణిపాకం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, చిత్తూరు నగరంలోని రపముఖ వైద్య నిపుణులు డాక్టర్ జి.సురేష్, డాక్టర్ ఏఆర్.గుణలతో పాటు వైద్యసిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో తెలంగాణా అడిషినల్ డీజీపీ

కాణిపాకం, జనవరి 5 ప్రభాతవార్త:

తెలంగాణా రాష్ట్ర అడిషినల్ డీజీపీ(టెక్నికల్ సర్వీసెస్) వివి.శ్రీనివాసరావు ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. వారి వెంట స్థానిక ఎస్సై ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదులో 'దేశం' రికార్డు

**- ఒక కోటి మంది సభ్యులు లక్ష్యంగా అడుగులు**
**- ఇప్పటికే 96 లక్షల మందికి సభ్యత్వాలు**

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సొంత జిల్లా చిత్తూరు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డును సృష్టిస్తోంది. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు గడువును సంక్రాంతి పండుగ రోజు వరకు పొడగించడంతో ఒక కోటి మందితో సభ్యత్వం చేసి సభ్యత్వ నమోదులో చిత్తూరు జిల్లా సరికొత్త రికార్డు సృష్టించడానికి తెలుగుదేశం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లాలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ఇప్పటికే 96 లక్షలు వరకు పూర్తయ్యింది. మరో నాలుగు లక్షల మందికి పార్టీ సభ్యత్వం ఇప్పిస్తే కోటి మంది సభ్యులకు పార్టీ సభ్యత్వం ఇచ్చినట్లు అవుతుంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదు భారీగా జరుగుతుంది. కుప్పం అసెంబ్లీ నియోజపకవర్గ పరిధిలో ఇప్పటికే 1.32 లక్షల మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కుప్పం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం కొత్తగా పార్టీ సభ్యత్వం పొందిన వారి సంఖ్య సైతం రికార్డు సృష్టిస్తోంది. ఒక్క కుప్పం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే కొత్తగా 48,589 మంది సభ్యత్వం తీసుకున్నారు. సంక్రాంతి పండుగ నాటికి కుప్పం నియోజకవర్గ పరిధిలో 1.50 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసకునేలా పార్టీ నాయకులు పక్కాగా ముందుకు వెళ్తున్నారు. అలాగే పార్టీ సభ్యత్వ నమోదులో చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం రెండవ స్థాయిలో వున్నప్పటికీ కొత్త సభ్యత్వ నమోదులో మాత్రం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రెండవ స్థానంను కైవసం చేసుకుంది. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 72 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకోగా ఇందులో కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్న వారు 34,879 మంది వున్నారు. అలాగే చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదులో ప్రస్తుతం మూడవ స్థానంలో నిలిచింది. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 64 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకోగా ఇందులో కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్న వారు 44,555 మంది వున్నారు. అలాగే పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదులో ప్రస్తుతం నాల్గవ స్థానంలో వుంది. పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 52 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకోగా ఇందులో 31,163 మంది కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అలాగే పార్టీ సభ్యత్వ నమోదులో పలమనేరు నియోజకవర్గం ఐదవ స్థానంలో నిలవగా ఇక్కడ 51 వేల మంది ప్రస్తుతం పార్టీ సభ్యత్వం తీసుకోగా ఇందులో కొత్తగా పార్టీ సభ్యత్వం 22,031 మంది తీసుకున్నారు. అలాగే గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదులో ఆరవ స్థానంలో నిలిచింది. జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 49 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకోగా ఇందులో 30,113 మంది కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అలాగే నగరి అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో చివరిస్థానంలో నిలిచింది. ఈ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 44 వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకుని వుండగా కొత్తగా 23,271 మంది ప్రస్తుతం పార్టీ సభ్యత్వం పొందారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షలు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించనుండటంతో చిత్తూరు జిల్లాలో ఈ సారి రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వం చేయించాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్యనాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. పార్టీ సభ్యత్వ నమోదు గడువు ముగిసే నాటికి ఒక కోటి మంది పార్టీ సభ్యత్యాలు పూర్తి చేయాలని కంకణం కట్టుకుని పార్టీ నాయకులు శ్రమిస్తున్నారు.

## రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా కొన్నలి గ్రామం



తొట్టంబేడు, జనవరి 5 ప్రభాతవార్త

రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా కొన్నలి గ్రామం ఎంపికైందని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాంప్రసాద్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంపికైన గ్రామాల్లో సర్వేచేశారని అయితే ప్రస్తుతంతిరిగి ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తోందన్నారు. ఇందులో జిల్లాలోని తొట్టంబేడు మండలంలో పైలట్ ప్రాజెక్టుగా కొన్నలి గ్రామాన్ని ఎంపికచేశారని ఈరెవెన్యూదాఖలాలో 70 సర్వేనంబర్లుతో పాటు 529.03ఎకరాలను తిరిగి రీసర్వేచేసి ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రతి ఒక్క అన్నదాత రీసర్వేలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోవుకాలంలో ఏలాంటి సమస్యలు లేకుండా ఉండడమే లక్ష్యమన్నారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతుందంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయ డిఐ రాఘవయ్య, డిటి జగన్‌మోహన్‌రెడ్డి, సచివాలయ సర్వేయర్లు లోకేష్, రాఘవ కమ్యూనిటీ సర్వేయర్ సత్యనారాయణ, సతదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్ రెడ్డి



**తిరుచానూరు, జనవరి 5, ప్రభాతవార్త:** తిరుచానూరు పద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగాధ్వజస్థంభాన్నినమస్కరించి అమ్మవారి ప్రత్యేక దర్శనంలో పాల్గొన్నారు. అనంతరం ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేసారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్లు, ఏవిఐ బ్రహ్మానందరాజు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



**శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త** మానవసేవే మాధవసేవ అని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి నగరం వినుత, మరియు నాయకులు కోట చంద్రబాబులు అన్నారు. ఆదివారం పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ 157వ నెల సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు మునీర్‌బాషా అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా విచ్చేసిన వినుత నగరం వినుత మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న నినాదం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినెల తప్పకుండా దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న సంస్థ అధ్యక్షుడు మునీర్‌బాషాను అభినందించారు. 157నెలలుగా అందిస్తున్న కార్యక్రమాలు ఎంతో మంది దివ్యాంగులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులుగరికపాటిరమేష్‌బాబు, బాబాఫరీద్, పుణ్యాండిల్లీకుమార్, హెల్పింగ్ హ్యాండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా గౌరమ్మ గ్రామోత్సవం



**శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త** ధనుర్మాసం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు గౌరమ్మగా గొబ్బెమ్మగా పుర ప్రజలకు ఉదయం దర్శనమివ్వటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో ఆదివారం గౌరమ్మను ఆలయంలోని అలంకార మండపంలో చక్కగా అలంకరించి గ్రామోత్సవానికి తరలించారు. బోయిలు మోసుకుంటూ గ్రామోత్సవం సాగించారు. నాలుగుమాడావీధుల్లో ఇంటింటి ఎదురుగా అమ్మవారికి హారతులిచ్చారు.అమ్మవారిని చక్కగా పుష్పాలంకారం జరిపారు. చూడటానికి వేయ్యి కళ్ళు చాలవన్నట్లు తీర్చి దిద్దారు. గ్రామోత్సవంతో పాటు టెంపుల్ ఇన్సెపెక్టర్ హరిబాబుయాదవ్ దఫేదారులు,సిబ్బంది వెంటరాగా ఉత్సవం సాగింది.

## నేటి నుంచి వెటర్నరీలో క్రీడా సాంస్కృతిక పోటీలు

తిరుపతి విద్య జనవరి 5 ప్రభాత వార్త:



ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా సోమవారం నుంచి ఈ నెల 10 వ తేదీవరకు వెటర్నరీ వర్సిటీ అంతర్కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతిరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వెటర్నరీ,ఒక డెయిరీ కాళాశాల నుంచి సుమారు 490మంది విద్యార్థులు వివిధ విభాగాలలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలియజేశారు.ఐదురోజుల పాటు జరిగే ఈ పోటీలకు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.ప్రారంభ కార్యక్రమానికి టీటీడీ విజిలెన్స్ అధికారితో పాటు వీసీ పాల్గొంటారని తెలిపారు.

## ఎస్ఐని కలసిన టీడీపీ నాయకులు

కేవీబీ పురం, జనవరి 5 ప్రభాతవార్త



కేవీబీ పురం మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నరేష్‌ని టీడీపీ సీనియర్ నేత తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఎస్ఐ నరేష్ దొరబాబునాయుడుని ఆప్యాయంగా పలకరించి కేవీబీ పురం మండలంలో జరుగుతున్న కొన్ని విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో బొర్రా శేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమలపై విచారణ చేపట్టాలి - సీపీఐ డిమాండ్

సత్యవేడు, జనవరి 5 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలోని కొత్తమారి కుప్పం రెవెన్యూలో భూ అక్రమాలపై జిల్లాకలెక్టర్ కల్పించుకుని విచారణ చేపట్టాలని కొత్తమారికుప్పం గిరిజన కాలనీలో జరిగిన సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. కొత్తమారికుప్పం రెవెన్యూలోని సర్వే నెం.350 నుంచి 388 ఎకరాల భూమి అనర్హులు. స్థానికేతరులు సత్యవేడు రెవెన్యూ అధికారులకు లక్షలాది రూపాయలు ముట్టచెప్పి పట్టాలు లేకపోయినా సంబంధిత భూములపై ఎలాంటి హక్కుల పత్రాలు లేకపోయినా భూ ఆక్రమిత దారుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని ఈ పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించుకుని కొంత భూముల్లో మామిడి చెట్లు తగిలిన చెట్లు పెంచుకుంటున్నారని అర్హులైన ఎస్సీ, ఎస్టీలు భూములు పంచాలని కోరినా, అడిగినా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని, పేదల భూమిలోకి వెళ్లితే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెడతామని రెవెన్యూ అధికారులు గ్రామంలో తండోరా చేయిస్తున్నారని సంబంధిత భూములపై విచారణ జరిగితే అనేక అక్రమాలు బయటపడతాయని చిన్నిరాజ్ తెలియజేశారు. సంబంధిత భూములు విషయమై అర్హులైన ఎస్సీ, ఎస్టీపేదలు తహసీల్దార్‌కి అర్జీలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు కల్పించుకుని కొత్తమారికుప్పం భూ అక్రమాలపై విచారణ జరిపి నిగ్గు తేల్చాలని అలా కాని ఎడల భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రజా సంఘాలతోకలిసి పెద్ద ఎత్తున ప్రత్యక్ష పోరాటానికి దిగవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున, రైతు సంఘ నాయకులు ధనంజయలు, గిరిజన సంఘం నాయకులు పాపయ్య, స్వప్న, సదమయ్య, సురేష్, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎడ్విన్ జర్నల్ ఎడిటోరియల్ మెంబర్ ప్రొఫెసర్ దేవ ప్రసాద రాజు

తిరుపతి విద్య జనవరి 5 ప్రభాత వార్త:



సైన్స్ రంగంలో ప్రఖ్యాత జర్నల్ గా చెలామణి అవుతున్న రెడ్విన్ జర్నల్ ఎడిటోరియల్ మెంబర్గా ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి దేవ ప్రసాద్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ జర్నల్ ఇండియన్ ప్రతినిధి ఒబిరియన్ ఆదివారం నియామకపత్రాన్ని విడుదల చేశారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో అధ్యాపకులుగా ప్రస్థావన ప్రారంభించిన ఆయన వర్సిటీ అడ్మిషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్గా, హాస్టల్ వార్డెన్ గా, రీసెట్ కన్వీనర్ గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా విశేష సేవలందించారు. బోధన, పరిశోధన, విస్తరణ, పాలనా రంగాలలో తనదైన ముద్ర వేశారు. అరుదైనఅవకాశాన్నిదక్కించుకున్నఆయననువర్సిటీఅధికారులు, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

## రెడ్ చెర్రీస్ పాఠశాలలో ఘనంగా 13 వ వార్షికోత్సవం

తిరుపతి విద్య జనవరి 5 ప్రభాత వార్త:



తిరుపతిలోని రెడ్ చెర్రీస్ పాఠశాలలో ఆదివారం పిఎల్ఆర్ గ్రాండ్ లో ఘనంగా 13వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీస్తూ ఒత్తిడి లేని విద్యను అందించడంలో రెడ్ చెర్రీస్ పాఠశాల ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన విద్యను అందిస్తూ ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటీ వంటి సంస్థలలో విద్యార్థులు తమ స్థానాలను సాధించడం కోసం శిక్షణ ఇస్తూ, జాతీయస్థాయి మరియు రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం చేసుకోవడంలో తమ పాఠశాలలో అత్యున్నత స్థానం లో అని అన్నారు. అనంతరం నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పన్నూరు చెరువు రూ.2.25 లక్షలు వేలం

విజయపురం, జనవరి 5 ప్రభాతవార్త:

పన్నూరు చెరువు చేపల వేలం రూ.2.25 లక్షలకు పాడినట్లు ఈవోపీఆర్డీ రాజేంద్ర తెలిపారు. చెరువుల్లో సంవత్సరం రోజులు వరకు చేపలు పెంపకం, అమ్మకం చేసుకోవచ్చని తెలిపారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని పంచాయతీ అకౌంట్‌కు జమ చేస్తున్నట్లు తెలిపారు.

## మహవీరాపురంలో టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

విజయపురం, జనవరి 5 ప్రభాతవార్త:



మండలంలోని మహవీరాపురంలో టీడీపీ కార్యకర్త చెంచయ్య మృతికి ఆదివారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్ శేఖర్, టీడీపీ నాయకులు బాలాజీ, మురళీనాయుడు, పలువురుటీడీపీనాయకులు ఆయనతో పాటు ఉన్నారు.

## ఎస్ జి ఎస్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక.

తిరుపతి విద్య జనవరి 5 ప్రభాత వార్త.



స్థానిక ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో గోవిందరాజస్వామి వాకర్స్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో రిటైర్డ్ డిఎస్పి శంకర్ ఎలక్షన్ ఆఫీసర్ గా విధులు నిర్వహించడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ గా పిసి రాయల్, ప్రెసిడెంట్ కె రఘురామ రెడ్డి, సెక్రెటరీగా తోట చక్రపాణి, ట్రెజరర్ గా జి పోతప్ప, వైస్ ప్రెసిడెంట్ భారతి, కృష్ణమూర్తి, జాయింట్ సెక్రెటరీ గా ఏ గోపి యాదవ్, పి హరిబాబు, ఈసీ మెంబర్స్ శివారెడ్డి, చంద్రశేఖర్, రమణ, దొరస్వామి నాయుడు, సుబ్బారావు, మురళి మోహన్ ను ఎన్నుకోవడం జరిగింది.

## అన్నదాన కార్యక్రమానికి బియ్యం బస్తాలు వితరణ

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త



డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమానికి జనసేన ఇన్‌ఛార్జి వినుత కోట 25 బస్తాల బియ్యం వితరణగా అందించారు. ప్రతి గురువారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండు సెంటర్ వద్ద జరిగే డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం గత 24 వారాలుగా నిర్వహిస్తున్నారు. ఈవారం అన్నదాన కార్యక్రమానికి వినుత కోత 25 బస్తాలు బియ్యం వితరణగా ఇవ్వడంతో పాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ సమన్వయకర్తలు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవిలకు వితరణ చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పేట చంద్రశేఖర్, కావలిశివకుమార్, తోటగణేష్, భాగ్యలక్ష్మి, పేట. చిరంజీవి, రవికుమార్‌రెడ్డి, కవిత, బాలాజీ, నితీష్, వెంకటరమణ, దుమ్మురాయల్, శారద, గాయత్రి, సురేష్, శ్రీను, తేజ, దినేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

## సాధురామలింగస్వామి అన్నదాన ట్రస్టు నూతన కమిటీ

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త



శ్రీసాదు రామలింగస్వామి అన్నదాన ట్రస్టు వ్యవస్థాపకులైన శ్రీపరబ్రహ్మానందగిరి స్వామి అధ్యక్షతన శారద ఓరియంటల్ ఎడ్యుకేషనల్ కమిటీ, శ్రీకాళహస్తి సోదర సంస్థల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో నూతనంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇటీవల పాటూరిసుబ్రహ్మణ్యం నాయుడు మృతితో కరస్పాండెంట్ పదవికి ఏర్పడిన ఖాళీ ఈసందర్భంగా భర్తీ చేశారు. మిగిలిన సభ్యులను కూడా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించి నియమించారు. అధ్యక్షులుగా శ్రీపరబ్రహ్మానందగిరి స్వామి, కార్యదర్శిగా శ్రీపరమాత్మానందగిరిస్వామి, సహాయ కార్యదర్శి మరియు కరస్పాండెంట్ పి.వ్యాసులు, ట్రెజరర్‌గా పుణ్యం రామస్వామి ఆనంద్, సభ్యులుగా మారుపూడి పాపానాయుడు, ఇంటూరి మస్తాన్ నాయుడు, చెరుకు నాగమణినాయుడు, తానికొండ వెంకటరత్నంనాయుడు, అలగాని వేణుగోపాల్, మునగాల విజయకుమార్, కాకర్ల మోహన్‌లను సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు.

## పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

తిరుచానూరు, జనవరి 5, ప్రభాతవార్త

తిరుపతి తూర్పు గ్రామీణ మండలంలో పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఏఈ మురళినాయుడు ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పేట 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి పానకం ఫిడర్, 132 కెవి లైన్లు రేణిగుంట నుండి 132 కెవి తిరుపతి వరకు ట్రాన్స్ కో లైన్లు మరమ్మత్తులు చేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 6వ తేది సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. కావున గంగనగుంట, ఎంఎం కండ్రిగ, వేమూరు, పానకం హరిజనవాడ, తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అలరించిన జానపద, భరతనాట్య నృత్య ప్రదర్శనలు

**తిరుచానూరు, జనవరి 5 ప్రభాత వార్త:** తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్య నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. ఆ సంస్థ ఏఓ ఖాదర్ వలి సమాచారం మేరకు నెల్లూరుకు చెందిన గురుదత్త కళానిలయం బృందంచే ఆదివారం నృత్య ప్రదర్శ చేపట్టారు. ఇందులో భాగంగా భరతనాట్యం, జానపద నృత్యాలు వీక్షకులని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాకారులు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 2న 33వ అఖిల భారత బ్రాహ్మణ వేదిక

### గోడపత్రికలను ఆవిష్కరించిన సంఘం

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త



33వ అఖిల భారత వధూవరుల బ్రాహ్మణ వేదికను వచ్చే నెల 2న నిరహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు సిఆర్‌కె శేషగిరిరావు ఆదివారం తెలిపారు. ఇక్కడి పుష్పగిరి మఠంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. అఖిల భారత బ్రాహ్మణ కళ్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం మరియు తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘంలసంయుక్తంగా సంస్థ రజతోత్సవ సందర్భంగా తిరుపతిలోని ఇస్కాన్ రోడ్ వినాయక నగర్‌లో గల శ్రీ కంచిపాదుక మండపంలో సామూహిక షష్టిపూర్తి, భీమరధ శాంతి, సహస్రచంద్ర దర్శనం, శాంతి హోమాలు, నూనత వస్త్రాల బహూకరణ, మాంగల్యధారణ వేద అశీర్వచనాలతో ఫిబ్రవరి 2న నిర్వహించుటకు నిర్ణయించినట్లు శేషగిరిరావు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన దలచిన బ్రాహ్మణులు తమ పేర్లను ఈ నెల 16 తేది లోపల నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు గోడపత్రికలను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శేషగిరితో పాటు సభ్యులు ఎం.ఎస్. విశ్వనాథ్, ఏ సుబ్బారావు శ్రీకాళహస్తికి చెందిన కార్యవర్గ సభ్యులు వి.యస్ గోపాలకృష్ణన్, కురువాడ నాగభూషణం, నైషధం రామసుధాకర్, శేషగిరి, గొల్లపూడి మాలతి, మురారి రజని, సురపురాజుజయసూర్య, ఇంద్రాణి ఉమామహేశ్వరి , సత్యనారాయణ, సిద్దిరాజు, చింతపల్లి సురేష్, దర్భాతులసీరాజు తదితరులు పాల్గొన్నారు

## 9న జగనన్న కాలనీలో గ్రీవెన్స్ డే

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు సమీపంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పట్టాల పంపిని ఇళ్ళ మంజూరు, నిర్మాణాల్లో భారీ ఎత్తున అవకతవకలు, అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలున్నాయని కాబట్టి కాలనీలోనే గ్రీవెన్స్‌డే ఈ నెల 9 నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమాలను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీ భూసేకరణ నుంచి ఇంటి నిర్మాణాల వరకు అన్ని అవకవతకలే జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ కాలనీ శంకుస్థాపనకు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఆరునెలల్లో కాలనీ పూర్తి అవుతుందని ప్రకటించారన్నారు. ఆరేళ్ళు గడచినా ఇక్కడ కనీసం వంద సంఖ్యలో కూడా ఇళ్ళు పూర్తి కాలేదు. ఈ నేపధ్యంలో వాస్తవంగా ఏం జరిగిందన్న అంశాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించుటకు ఈ నెల 9న కాలనీలోనే గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇక్కడ పట్టాలు పొందిన వారు ఇక్కడకు వచ్చి స్థలాలు పట్టాల మేరకు ఉన్నాయా లేదా సరి చూసుకోవాలని కోరారు.

## ఎంప్లాయిస్ యూనియన్‌చే అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఎపియస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ సారధ్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌వి ఎస్ బాబు రెండవ వర్ధంతి సందర్భంగా అన్నదా నాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా గౌరవాధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తరువాత బాబు ఆర్‌టిసికి అందించిన సేవలను స్మరించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసుపులేటి శ్రీనివాసకుమార్, జిపిఎస్ ఆచారి, టిఎం ఆచారి, డిఎంకెసిరెడ్డి, బీఎస్ఆర్ కుమార్, పిఎస్ ప్రసాద్, టిఎల్ మూర్తి, కుప్పయ్య, సూరిబాబు, కుమార్, కెఎ కుమార్, రామకృష్ణ ప్రసాద్, శరవణ, కెఆర్ కృష్ణ, మన్యం ఎసీ రాయలు, జిఆర్‌రెడ్డి, గంగాధరం, సునీల్, రోశయ్య, ప్రకాష్, రమేష్ తదితరులు హాజరయ్యారు, అన్నదానం జరిపారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిధి

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన వాయులింగేశ్వరుని సన్నిధిలో ఐఏయస్ అధికారి ప్రవీణ్‌కుమార్ పూజలు జరిపించుకున్నారు. మైన్స్ అండ్ జియాలజి శాఖకు చెందిన ప్రవీన్‌కుమార్‌కు ఆలయ పరిపాలనా భవనాల వద్ద మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు సారధ్యంలో స్వాగతం ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద వారికి వేదపండితులు ఆలయ ప్రోటోకాల్ మేరకు స్వాగతం పలికారు. రాష్ట్ర సిఐడి ఎస్‌పి సరిత, ఉంగుటూరు శాసనసభ్యుడు ధర్మరాజు వారి కుటుంబాలతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. వారికి ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు అందించారు. మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.

## బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 5 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం కొత్త కాల్వ గ్రామంలో కృషి బ్యాడ్మింటన్ ఆకాడమి నందు నెహ్రూయువ కేంద్రం, యువనేస్తం అసోసియేషన్ సంయుక్తంగా యువకులను క్రీడల్లో ఉత్సాహ పరచుటకు బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. యువనేస్తం సంఘం కార్యదర్శి జస్వంత్, యువనేస్తం ట్రస్టు అధ్యక్షులు వినోద్‌లో పోటీలను నిర్వహించారు. యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మదురాంతకం మునిశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో యువతలో నిగేఢంగా క్రీడలపట్ల ఆసక్తి ఉందని కానీ వారిని ప్రోత్సహించే వారు కరువయ్యారన్నారు. ఆయన మాట్లాడుతూ నెహ్రూయువ కేంద్రం నిర్వహిస్తున్న బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా యువనేస్తం అసోసియేషన్ బ్యాడ్మింటన్ వాలీబాల్ పోటీలు పాపానాయుడుపేట కొత్త కాల్వ గ్రామంలో ఏర్పాటు చేసారన్నారు. ఇందులో భాగంగా అర్జున్ టీం, నాదముని టీంల మధ్య హోరాహోరిగా సాగిందన్నారు. అర్జున్ టీం విజేతలయ్యారన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిదిగా సేవ్ అక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేశవులు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రోషన్‌లు హాజరై విజేతలకు మెడల్స్‌తో పాటు నగదు బహుమతిని అందించారు.

## చంద్రగిరి నుండి వడమాలపేటకు "మురళిరెడ్డి బదిలీ"

చంద్రగిరి, జనవరి 5 ప్రభాతవార్త:



చంద్రగిరి మండల స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా పురుషోత్తం నాయుడు విధుల్లో చేరారు. చంద్రగిరి ఎస్‌బి కానిస్టేబుల్‌గా సుధీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలందించిన మురళి రెడ్డి వడమాలపేటకు బదిలీ అయ్యారు. మండల ప్రజలతో మమేకమై ఎస్బీ కానిస్టేబుల్‌గా మురళిరెడ్డి అందరి మన్ననలు అందుకుని తగిన గుర్తింపు పొందారు. ఆయన స్థానంలో పోలీస్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, తిరుమల క్రైమ్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌గా పురుషోత్తం నాయుడును స్పెషల్ బ్రాంచికి బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన ఎంఎల్‌ఏ పులివర్తి నానిని మర్యాదపూర్వకంగా కలసి అనంతరం బాధ్యతలు చేపట్టారు.

## రహదారుల అభివృద్ధితోనే పల్లెల ప్రగతి

### ఎంఎల్ఏ పులివర్తి నాని

రామచంద్రాపురం, జనవరి 5 ప్రభాతవార్త:



రహదారుల అభివృద్ధితోనే పల్లెలు (గ్రామాలు) ప్రగతి సాధించగలవని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. ఆదివారం తాటితోపు కండ్రిగ సమీపంలో గుండోడు కనుమ రహదారి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల నడుమ భూమిపూజ కార్యక్రమం పూర్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండోడు కనుమ రోడ్డు పనులను ఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.3.15 కోట్లుతో 22 అడుగుల వెడల్పుతో సుమారు 4 కిలోమీటర్లు పొడవు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ రహదారి ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని 30 గ్రామాల ప్రజలకు తిరుపతి వెళ్ళేందుకు సుమారు 7 కిలోమీటర్లు దూరం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరమణ, ఎంపిడిఓ ఇందిర, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, మాజీ ఎంపిపి తానికొండ కేశవులు, నాయకులు జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, కోరా హరిప్రసాద్, సురేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, ఉమాపతి నాయుడు, దినేష్, రావిళ్ళ గిరి నాయుడు, గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేపకుప్పంలో జల్లికట్టు సంబరాలు

### పట్టీల కోసం యువత కుస్తీ

రామచంద్రాపురం, జనవరి 5 ప్రభాతవార్త:



సంక్రాంతికి ముందుగానే వేపకుప్పంలో ఆదివారం జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటాయి. పట్టీల కోసం యువత కుస్తీపడ్డారు. ఉదయాన్నే రైతులు పశు వుల కొమ్ములను అందంగా మలచి రంగులువేసి సుందరంగా ముస్తాబు చేశారు. కొయ్య చెక్కతో చెక్కిన పట్టీలకు వివిధ దేవతామూర్తులు, తమ అభిమాన నాయకుల చిత్రాలను అతికించిన పట్టీలను పశువుల కొమ్ములకు కట్టి, డప్పులను వాయించి జనం మధ్యలోకి వదలిపెట్టారు. పరిసర గ్రామాల నుండి వచ్చిన యువత పట్టీల కోసం పోటీపడ్డారు. ఈ క్రమంలో కొంత మందికి స్వల్పగాయాలయ్యాయి. జల్లికట్టు తిలకించడానికి పొరుగు జిల్లాల నుండి భారీ ఎత్తున తరలివచ్చారు.

# తిరుపతి డివిజన్

## రేపు మంగళగిరిలో రెవెన్యూ రీ సర్వే అంశాలపై వర్క్‌షాపు

- సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు తప్పక హాజరు కావాలి
- కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ



**తిరుపతి కలెక్టరేట్, జనవరి 5 ప్రభాతవార్త :** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదిన మంగళవారం గుంటూరు సీసీఎల్ఏ మంగళగిరిలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై వర్క్‌షాపు జరగనున్నదని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు తిరుపతి జిల్లా పరిధిలోని సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు ప్రతి ఒక్కరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా తిరుపతి జిల్లాలోని తిరుపతి, శ్రీ కాళహస్తి, సూళ్ళూరుపేట ఆర్డీవోలు అలాగే గూడూరు సబ్ కలెక్టర్, అలాగే రెవెన్యూ అధికారులు సీసీఎల్‌సీ వర్క్‌షాపుకు హాజరు కానున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా "అమ్మవారి ఉత్సవాలు"

### శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఎంఎల్ఏ సమీక్ష



**చంద్రగిరి, జనవరి 5 ప్రభాతవార్త:** చంద్రగిరి గ్రామదేవతగా కొలువుదీరిన శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆయన ఆలయ ఈఓ మమత అధ్యక్షతన వివిధశాఖల అధికారులు, గ్రామస్థులు, ఎన్‌డిఎ కూటమి నాయకులతో ఆయన ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేది నుండి 17 వరకు సంక్రాంతి మహోత్సవాలలో అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. పంచాయతీ పారిశుధ్య పనులు, విద్యుత్‌శాఖ నిరంతరాయ విద్యుత్ సరఫరా, భక్తుల సేవలకు వాలంటీర్లు, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అప్రమత్తం వుండాలని అన్నారు. ముఖ్యంగా కొండచుట్టు రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, మంచినీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ యంత్రాగం అమ్మవారి వాహన సేవలను పర్యవేక్షించాలన్నారు. వాహనబేరర్లకు యూనిఫారమ్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివసుబ్బరామయ్య, అధికారులు, పంచాయతీ అభివృద్ధి కమిటీ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కోలుకుంటున్న విద్యార్థినులు

### డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి

చంద్రగిరి, జనవరి 5 ప్రభాతవార్త:



ఉడకని భోజనం తినడంతో అస్వస్థతకు గురై ఏరియా ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులు వైద్యచికిత్సలతో కోలుకుంటున్నట్లు డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందరావు తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో వైద్యచికిత్సలకు అడ్మిట్ అయిన పిల్లలను ఆయన పరిశీలించారు. చంద్రగిరి శ్రీద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు శనివారం మధ్యాహ్న భోజనం చేసి కడుపు నొప్పితో కొంత మంది ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ పర్యవేక్షణలో ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది పిల్లల ఆరోగ్య స్థితిని ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## రైతులకు యూరియా కొరతను తీర్చండి

కేవీబీ పురం, జనవరి 5 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలో రైతులకు యూరియా కొరతను తక్షణమే తీర్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డిసెంబరు నెలల నుంచి రైతులు నాట్లు వేరుశనగ వేయడం ప్రారంభించినందుకు పంటలకు రైతులకు యూరియా అవసరమని రైతులకు తగినంత సరఫరా చేయడంలో అధికారుల వైఫల్యం ఉందని విమర్శించారు. రైతులకు నిత్యం చేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని స్థితిలో ఉందని దుయ్యబట్టారు. రైతులు యూరియా కొరకు పిచ్చాటూరు, శ్రీకాళహస్తి లాంటి పట్టణాలకు వెంపర్లాడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కొంత మంది దుకాణ దారులు కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియాను విక్రయిస్తామని చెబుతుండడంతో రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి యూరియా కొరతను తీర్చాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## క్వారీ కాలుష్యం నుంచి ప్రజలను కాపాడండి

### రెవెన్యూ సదస్సులో రైతుల ఆందోళన

కేవీబీ పురం, జనవరి 5 ప్రభాతవార్త:

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం సమీపంలోని పెరిందేశం రెవెన్యూలోని వీజే ఇన్ఫ్రాస్ట్రక్చర్ క్వారీ కాలుష్యం నుంచి పంటలను, ప్రజలను కాపాడాలని గ్రామస్తులు తెలుగుదేశం, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బ్రాహ్మణపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో బ్రాహ్మణపల్లి, గురుకుల కండ్రిగ గ్రామాల రైతులు పాల్గొని గ్రామం సమీపంలో ఉన్న కంకర క్వారీ నుంచి వెలువడే విష వ్యర్థ, రసాయానాల కాలుష్యాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, జల కాలుష్యం వల్ల ఆ నీళ్ల తాగిన పశువులు కాని, పంటలు కాని రోగాల బారిన పడుతున్నాయని అధికారుల ముందు మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌నాయుడు, సీపీఎం కార్యదర్శి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీ యాజమాన్యానికి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. శబ్ద కాలుష్యం వల్ల తమ నివాస ఇల్లు కూడా పగుళ్ల ఏర్పడుతున్నట్లు ఆందోళన చెందారు. క్వారీ నుంచి వెలువడే దుమ్ము, ధూళి వల్ల గాలి కలుషితమై ప్రజలందరూ కూడా రోగాల బారిన పడుతున్నారని తక్షణమే క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకుని గ్రామస్తులను కాపాడాలని పెద్ద ఎత్తున నిరసన తెలియజేసి తహసీల్దార్ మునిరత్నంకు తెలుగుదేశం మండల అధ్యక్షుడు రామాంజులనాయుడుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపినాథరెడ్డికి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు థామస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, గ్రామంలోని రైతులు, మాజీ మార్కెటింగ్ చైర్మన్ విజయకుమార్ నాయుడు, జయప్రకాష్‌నాయుడు, శ్యాం నాయుడు, రఘుపతి నాయుడు, ధనంజయలునాయుడు, దొరవేలు, గురునాథం, ఎర్రబాబు, మనోహర్ కొండేటి గంగయ్య, వీరస్వామి, వెంకటయ్య, వెంకటస్వామి, చిన్న సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ మార్గంలో పీలేరుకు బస్సు సౌకర్యం కల్పించండి

పాకాల, జనవరి 5, ప్రభాతవార్త



పాకాల నుంచి పీలేరుకు బస్సుల సౌకర్యం కల్పించమని ప్రయాణికులు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఆర్ టీ సి పట్టించుకోవటం లేదు. పాకాల మీదుగా ప్రతిరోజు తిరుపతి నుంచి వయా పాకాల మీదుగా పుంగనూరుకు రోజుకి దాదాపు 36 ట్రిప్పులు పైగా అవసరానికి మించి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు 6 ట్రిప్పులు ప్రస్తుతం వయా పాకాలపై ప్రస్తుతం నడుస్తూ వున్నాయి. పాకాల నుంచి పీలేరు వరకు సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నారు. తిరుపతి నుంచి పుంగనూరుకు బస్సులు నడపే విషయంలో అన్ని డిపో అధికారులు పోటీ పడి మరీ పడుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వారి తీరు మార్చుకొని కనీసం రోజుకి నాలుగు బస్సులునైనా తిరుపతి నుంచి పాకాల మీదుగా పీలేరుకు నడపాలని ప్రయాణికులు మరియు భారతీయ జనతా పార్టీ కిసాన్ జిల్లా మోర్చా కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి వెంకటాద్రి నాయుడు అధికారులను కోరుతున్నారు.

## సత్తాచాటిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

### - స్పీడ్ స్కేటింగ్లో ప్రతిభ

తిరుపతి క్రీడ, జనవరి 5, ప్రభాతవార్త:



గత డిసెంబరు నెలలో తిరుపతిలోని శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన 2వ ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ షిప్ 2024 - 25 పోటీలో వెరిటాస్ సైనిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 5వ తరగతికి చెందిన రోహిత్ 1000మీ, రిలేలో బంగారు పతకాలు, నిహాల్ 400, 200 మీలలో 2 బంగారు పతకాలు, 4వ తరగతికి చెందిన గగనదీప్ 1000మీ, రిలేలో వెండి పతకాలు, 3వ తరగతికి చెందిన శ్రాగ్విజ 400మీ, రిలేలో వెండి పతకాలను సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, శిక్ష కుడు మహేష్ ను పాఠశాల చైర్మన్ డాక్టర్ బి. శేషారెడ్డి, డైరె క్టర్ బి. శ్రీకర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఆర్.ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎస్. నాగార్జున అభినందించారు.

## అతిధుల తాకిడి

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త



ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరిగింది. వచ్చిన వారికి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ప్రోటోకాల్‌ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పిఆర్‌ఓ రవి, ఎఇఓ లోకేశ్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుబ్రమణ్యం, సుదర్శనం నాయుడు తదితరులు పర్యవేక్షించారు. రాష్ట్ర సిఐడి ఎస్‌పి సరిత, ఉంగుటూరు శాసనసభ్యుడు ధర్మరాజు వారి కుటుంబాలతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. వారికి ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు అందించారు. మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.

## ఎన్‌బికెఆర్‌ని...యూనివర్శిటీ చేస్తా : నేదురుమల్లి



కోట, జనవరి 5 ప్రభాతవార్త : ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలను రాబోయే రోజుల్లో విశ్వవిద్యాలయ ంగా మారుస్తామని విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన్ను ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని, రాబోవు రోజుల్లో విద్యాసంస్థలను యూనివర్శిటీగా చేయబోతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఉద్యోగులకు, నాయకులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

# గూడూరు డివిజన్

## 2027లో జెమిలి ఎన్నికలు :నేదురుమల్లి

వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త : 2027 సంవత్సరంలో జెమిలి ఎన్నికలు జరుగుతాయాన్ని వైఎస్ ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నాడు. ఆదివారం వాకాడులో నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు, 2027 సంవత్సరంలో జమిలి ఎన్నికలు జరుగుతాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆ ప్రక్రియ మొదలుపెట్టిన నేపథ్యంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పార్టీ కోసం అందరం కలిసికట్టుగా పని చేసి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలా అన్నారు.

## టిడిపిలో చేరిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



సూళ్లూరుపేట, జనవరి 5 ప్రభాతవార్త : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమక్షంలో తడ మండలం మాంబట్టు గ్రామానికి చెందిన వేనాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన పార్టీలో చేరి లక్ష రూపాయలు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో 500 మందిని తెలుగుదేశం పార్టీలో చేర్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి కార్యదర్శి ఎజి కిషోర్, సంచి కృష్ణయ్య, పరసా రాజా, కారంచేటి మల్లికార్జునశర్మ, జనసేన నేత పొన్నా కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాకరేపుతున్న కాకాణి...పదవుల పందేరం



నాయుడుపేట రూరల్, జనవరి 5 ప్రభాతవార్త : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గంలో నియమించిన పార్టీ పదవులు కాకరేపుతున్నాయి. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచనల మేరకు సూళ్లూరుపేట నియోజ కవర్గంలో పార్టీ పటిష్టతకు దీర్ఘాలోచనలు జరిపి పదవుల బాధ్యతలు ఇప్పించినట్లు సమాచారం. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రముఖంగా ఎన్‌డిసిసిబి మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇప్పటికే రాష్ట్రస్థాయి పదవిలో ఉండగా, జిల్లా స్థాయిలో నాయుడుపేట ప్రాంతానికి చెందిన కామిరెడ్డి రాజారెడ్డికి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరిగా, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి ఉపాధ్యక్షులుగా, ఒట్టూరు కిషోర్‌యాదవ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తనదైన శైలిలో ఈ ప్రాంత వాసులతో కలిసి వేరువేరుగా నెల్లూరులోని కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఒట్టూరు కిషోర్ యాదవ్, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, దారా రవి, కురుగొండ ధనలక్ష్మి, కటకం జయరామయ్య, దశరధరామిరెడ్డి, లాయర్ కుమార్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు సాగాలి



గూడూరు, జనవరి 5 ప్రభాతవార్త : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థినీ విద్యార్థులు నూతన ఆలోచనలతో ముందుకు వెళితే విజయం సాధిస్తారని న్యాక్ ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్ధ వెల్లడించారు. గూడూరులోని ఆదిశంకర ఇంజనీ రింగ్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశా లలో 8వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాక్ ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్ధ, అనంతపూర్ జెఎన్టియు రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరయ్యారు. ముఖ్య అతిథులకు కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య, అరవింద ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. వితితిది ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్ధ మాట్లా డుతూ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఇక్కడ చదువు తున్నారని ఆదిశంకర కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చడం అభినందనీయమని అన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన వారు నేటి పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని వినూత్న ఆలోచనలతో ముందుకు వెళితే విజయం సాధిస్తారని సూచించారు. జేఎన్టీయూ యూనివర్సిటీ రిజిస్ట్రర్ కృష్ణయ్య మాట్లాడుతూ డిగ్రీ అయిపోయింది మనకేమిలే అనుకోకుండా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని కొరకు కష్టపడాలని నేడు ప్రతి రంగంలో విపరీతమైన పోటీ ఉందని వాటిని అధిగమించేందుకు కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మోహన్, ఏఓ రామయ్య హెచ్వోడీలు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావానికి సంఘీభావంగా ర్యాలీ



కోట, జనవరి 5 ప్రభాతవార్త : విజయవాడ కేంద్రంగా జరుగుతున్న హైందవ శంఖారావం మహాసభకు సంఘీభావంగా కోట గాంధీబొమ్మ సెంటర్ నుంచి విద్యానగర్‌లోని గాంధీబొమ్మ సెంటర్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. కోట క్రాస్‌రోడ్డులో మానవహారంగా హైందవ శంఖా రావానికి పలువురు తమ మద్దతు ప్రకటిం చారు. పలువురు మాట్లాడుతూ సనాతనమైన హిందూ ధర్మానికి అనేక రకాల ఇబ్బందులు ఉన్నాయని, దేవాదాయశాఖ ద్వారా నిర్వహిం చబడుతున్న ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆలయాలపై వివిధ రకాల వారి పెత్తనాలతో ఆలయ వ్యవస్థ దెబ్బతింటుందని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో నారాయణరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి, హరీష్, చంద్రారెడ్డి, సుబ్బారావు, మధు, యుగంధర్, హేమంతశర్మ, సాయిబాబా, నందగోపాల్, అనంతచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రసాద్ గౌడ్

కోట, జనవరి 5 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం రాష్ట్ర, జిల్లా కమిటీల జాబితాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోట మండల మాజీ జడ్పిటిసి సభ్యులు ఉప్పల ప్రసాద్ గౌడ్‌ను నియమించారు. ఉప్పల ప్రసాద్ గౌడ్ పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ కోట మండలంలో పార్టీని ముందుకు నడిపారు. అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్ర వైసీపీ సెక్రటరీ పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు.

## పేట వైసిపి ఆర్గనైజింగ్ సెక్రటరిగా కామిరెడ్డి



నాయుడుపేట జనవరి 5 ప్రభాతవార్త :సూళ్ళూరుపేట నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆర్గనైజిగ్ సెక్రటరీగా నాయుడుపేట పట్టణానికి చెందిన కామిరెడ్డి రాజారెడ్డిని ఆపార్టీ అధిష్టానం నియమించడంతో పలువురు వేసిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు.సూళ్ళూరుపేట నియోజకవర్గ మాజీఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కామిరెడ్డి రాజారెడ్డిని పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపాల్టి కౌన్సిలర్లు పి.చంద్రారెడ్డి,దారా రవి,పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## టిడ్కో గృహ సముదాయంలో కార్డన్ సెర్చ్



గూడూరు, జనవరి 5 ప్రభాతవార్త: గూడూరు డీఎస్పీ సూచనల మేరకు రూరల్ సీఐ ఆధ్వర్యంలో గూడూరు పట్టణం గాంధీనగర్ టిడ్కో గృహ సముదాయంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. నేరాలను నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు అన్నారు. గూడూరు పట్టణం గాంధీనగర్ టిడ్కో గృహ సముదాయంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ఒక కారు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు మనోజ్ కుమార్, గోపాల్, తిరుపతయ్య, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆసరా



గూడూరు, జనవరి 5 ప్రభాతవార్త : సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం గూడూరు వారి ఆధ్వర్యంలో డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి డాక్టర్ సి.రోహిణి దాతృత్వంతో 20 మంది ఆత్మీయులకు సంక్రాంతి పండుగను పురస్కరిం చుకుని నెలకు సరిపడా పలసరుకులు నూతన వస్త్రాలు లబ్ధిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సింహ పురిరెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మేడం మాట్లాడుతూ డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆశయాలను కొనసాగిం చుటలో నాలుగు సంవత్సరాల క్రితం మా నాన్నగారైన డాక్టర్ సిఆర్.రెడ్డి ఆసరా పేరుతో పలసరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని దీనిని క్రమం తప్పకుండా ప్రతి నెల ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు 15 మంది మహిళలకు చీరలను, ఐదు మంది మగవారికి చొక్కా, పంచలను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేశిరెడ్డి ప్రజేంద్రారెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, కందాటి రాఘవరెడ్డి, ఎర్రమాకు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,పలమాల హరినాథ్‌రెడ్డి, బత్తల శేషారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే



గూడూరు, జనవరి 5 ప్రభాతవార్త : మన తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని సిరామిక్ కళాశాలలో సిరామిక్ యూత్ అండ్ సిరా మిక్ యూత్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసేందుకు గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలు వేసిన రంగ వల్లులను తిలకించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఈ ముగ్గుల పోటీల ద్వారా గూడూరు పట్టణంలో ముందుగానే సంక్రాంతి శోభ సంతరించుకుందని పేర్కొన్నారు .

## నేదురుమల్లి నివాసంలో సందడే సందడి



వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త : వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంను, నూతన సంవత్సర సంబ రాలు ఘనంగా నిర్వహించారు. నేదురుమల్లి రాం కుమార్‌రెడ్డికి వైఎస్ఆర్సిపి గూడూరు ఇన్చార్జ్ మేరీగా మురళి కోట, వాకాడు, చిట్టమూరు, వెంకట గిరి, గూడూరు మండలాల నుండి వైఎస్ ఆర్సిపి నాయకులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు, ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల ప్రొఫెసర్స్, లెక్చరర్స్, సిబ్బంది, అభిమానులు, శ్రేయోభి లాషులు వందలాది సంఖ్యలో వచ్చి ఆత్మీయ పలకరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి మేరీగా మురళి, తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి. హిమకుమార్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడి పందాలు దాడుల్లో ముగ్గురు అరెస్ట్

వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త : వాకాడు మండలం కొండాపురం గ్రామంలో ఆదివారం కోడిపందాలు దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేసినట్లు వాకాడు ఎస్ఐ నాగబాబు తెలిపారు.ఆయన మాట్లాడుతూ కొండాపురం గ్రామంలో కోడిపందాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో, సమాచారం మేరకు కోడిపందాలు స్థావారానికి వెళ్లి దాడులు చేయగా కోడి పందెం దారులు పరారవుగా, ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుండి మూడు కోడులు, 1150 రూపాయలు స్వాధీన పరుచుకొని ముగ్గురు మీద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పట్టుదల క్రమశిక్షణతోనే కలెక్టర్ అయ్యాను



వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త : పట్టుదల క్రమశిక్షణతోనే కలెక్టర్ అయ్యానని ఎ. సునీల్ అన్నారు. ఆదివారం వాకాడు డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన పూర్వపు విద్యార్థుల రజితోత్సవ వేడుకల్లో భాగంగా గోవా టూరిజం ఐటి సెక్రటరీగా పనిచేస్తున్న సునీల్ ఐఏ ఎస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గురుకులంలో పూర్వ విద్యార్థులను కలిసి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంను సునీల్ ఆవిష్కరించారు. విద్యార్థులకు డయాస్ నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా 2,50,000 రూపాయలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో భాగంగా గోవా టూరిజం ఐటీ సెక్రటరీ సునీల్ మాట్లాడుతూ తాను గురుకుల పాఠశాలలోనే చదివానని విద్యారు లందరూ, విద్యార్థి దశలోనే చదువే లక్ష్యంగా చేసుకుని గురుకుల పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఏ ఏ అత్యున్నత ఉద్యోగాలలో ఉన్నారో వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అత్యున్నత ఉద్యోగాలు సాధించగలరని నమ్మకంతో కోరుతున్నాను అన్నారు. ఈ వేడుకలో పూర్వపు ప్రిన్సిపల్స్ డేవిడ్, యానాదయ,డి.సి.ఓపద్మజ,విజయలక్ష్మి, ఎస్తేరు,ప్రిన్సిపాల్ రామానుజాచారులు, ఏ.వెంకటేశ్వర్లు, గురుకుల పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం, ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఆత్మకూరు వెంకట శేషయ్య, కొణతం సుబ్రహ్మణ్యం, ఆములూరు కిషోర్ కుమార్, బిక్కి వెంకటేశ్వర్లు, బాల సుబ్రహ్మణ్యం, వాలంటీర్లు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలు,నాయకులకు అండగా నిలుస్తా:రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, జనవరి 5, ప్రభాతవార్త : పార్టీ కార్యకర్తల నాయకులకు ఎల్లవేళల అండగా ఉంటానని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు రాంకుమార్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికార పార్టీ వారు తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని లీగల్‌గా ఎదుర్కొంటామని తెలిపారు. వైసిపి జిల్లా కార్యదర్శి హరికృష్ణ, వైస్ ఛైర్మన్ బాలయ్య, కౌన్సిలర్ కళ్యాణి, నాయకులు సతీష్ ,బండి రమేష్ రెడ్డి, దశరథరామిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యచే సేవా కార్యక్రమాలు



వెంకటగిరి, జనవరి 5 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య నాయకులు తెలిపారు. స్థానిక శంకర్ మఠంలో బ్రాహ్మణ సమాఖ్య సమా వేశం జరిగింది. వారు మాట్లాడుతూ బ్రాహ్మణు లందరూ ఐక్యంగా ఉండి డిమాండ్లను పరిష్కరిం చుకోవాలని కోరారు. ఫిబ్రవరి నెల 16వ తేదీ మూడవ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధువుల పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేదం హరి ప్రసాద్, ఎన్ నరసింహచార్య, ముకుంద మహేష్, నరసింహ చారి శర్మ, బాబీ శర్మ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరును... నెల్లూరు జిల్లాలో కలపాలి -రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు తీర్మానం



గూడూరు, జనవరి 5 ప్రభాతవార్త : గూడూరును నెల్లూరు జిల్లాలోనే కలపాలని ఐక్యవేదిక సభ్యులు, ప్రముఖులు తదితరులు తీర్మానించారు. గూడూరు పట్టణం లోని షాదీమంజిల్ లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు,పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్ ఐక్యవేదిక అద్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో ప్రధానంగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలన్న అంశంపై ప్రజా సంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు చర్చించారు. తిరుపతి జిల్లాలో గూడూరు ఉన్న కారణంగా ప్రజలు పడుతున్న అవస్థలపై మాట్లాడారు. అనంతరం ఐక్యవేదిక ప్రతినిధులు కాలేషా, బిల్లు చెంచురామయ్య తదితరులు మాట్లాడుతూ గూడూరు తిరుపతి జిల్లాలో ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనుల మీద తిరుపతికి వెళ్ళాలంటే ఖర్చుతో పాటు సమయం ఎక్కువ పడుతుం దన్నారు. గత వైకాపా పాలనలో జరిగిన విభజనకు అవస్థలు పడుతున్నారని తెలిపారు.

ఎన్నికల్లో గెలిస్తే నెల్లూరు జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సునీల్ కుమార్ చెప్పారని, ఆ ప్రకారం చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుందామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు నాశిన భాస్కర్ గౌడ్, ఇశ్రాయిల్ కుమార్, పంటా శ్రీనివాసులు రెడ్డి రహీమ్, ప్రభాకర్, ప్రణీత్ యాదవ్ వెంకటేశ్వర్లు, జమాల్, పరిమల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం

వెంకటగిరి, జనవరి 5 ప్రభాతవార్త : భవన నిర్మాణ కార్మిక సంఘం ఫిబ్రవరి 23వ తేదీన అత్యంత ఘనంగా జరపడానికి భవన నిర్మాణ కార్మికులందరూ సన్నద్ధం కావాలని బాగున్నాను నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం అంకమ్మ గుడి దగ్గర భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నిర్మాణ రంగంలో లక్షలాదిమంది కార్మికులు ఉన్నారని వారి అవసరాలను తీర్చడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్క్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు జాన్, స్ట్రీట్ వండర్స్ జిల్లా అధ్యక్షులు మునీంద్ర భవన నిర్మాణ కార్మికులు తిరుమల వరుణ్ కుమార్ రామకృష్ణ తులసమ్మ రఫీ సుబ్బారెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జనం మధ్యలో పందులు... రావా రోగాలు!



శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాకిని ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం ఇక్కడకు కనీసం 15 నుంచి 20వేల మంది భక్తులు వస్తుంటారు. ఈ ఆధ్యాత్మిక నిలయం గ్రేడ్ 1 మున్సిపాలిటి, ఇక్కడ పారిశుధ్యం ఎలా ఉన్నా... నడిరోడ్డులపై పందులు స్వైరవిహారం చేస్తుంటాయి. మున్సిపాలిటి ప్రకటనలతో సరిపెడుతుంది. గత నెల సాహసించగా పందుల పెంపకం దార్లు మున్సిపల్ సిబ్బందిపై దాడి చేసి గాయపరచి ఆసుపత్రి పాల్జేసారు.

**పట్టణంలో పందుల విచ్చల విడి విహారం:**

ఓ వైపు శ్రీకాళహస్తి ప్రజలు,వాడల్లోఎటు చూసినా జ్వరాలు,జలుబులు,దగ్గులతో తల్లడిల్లుతున్నారు.ఒక సారి ఆనారోగ్యం చేస్తే కనీసం నెల రోజులు తగ్గటం లేదు. డాక్టర్లకు కూడా అంతు పట్టని జ్వరాలు సోకుతున్నాయి. ఒక్కొక్క సారి అనారోగ్యంతో డాక్టర్ వద్దకు వెళితే ఇక అప్పుల పాలే అన్నట్లు మారింది. ఈ నేపథ్యంలో పట్టణంలో పందుల స్వైర విహారం కనబడుతుంది. ముఖ్యంగా చెన్నై నుంచి శ్రీకాళహస్తికి వచ్చే పట్టణ శివారులో ఎల్ఐసి కాలనీ సమీపంలో మున్సిపల్ డంపింగ్ యార్డు ఉండేది. ఇక్కడ గమనిస్తే పందులు ప్రధాన రోడ్డుపై అడ్డదిడ్డంగా సంచరిస్తున్నాయి. ఇక ఎస్‌డికె నగర్, హరహర బావి ప్రాంతాల్లోరాత్రి వేళల్లో పందుల అరుపులకు జనం నిద్రపోలేకపోతున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఇక పానగల్‌లోని ప్రాజెక్టు వీధి పరిసరాల్లో కూడా పందులు విచ్చల విడిగా విహరిస్తున్నాయి. అన్నా క్యాంటిన్‌కు సమీపంలో ఏరియా ఆసుపత్రి రోడ్డులోనూ, ఏరియా ఆసుపత్రిలోనే పందులు దర్శనమి స్తుంటాయి. కైలాసగిరి కాలనీ,ఎన్‌టిఆర్ నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పందుల దర్శనం కనబడు తుంది. ఓ వైపు జనం జ్వరాలతో సతమతమౌతుంటే మున్సిపాలిటి ఏమో నాలుగు మాడావీధుల్లో పాకింగ్ అంటూ చేతులు దులుపుకుంటున్నారు.

**తరలింపుకు ప్రయత్నిస్తే దాడులు: శానిటరీ ఇన్సెపెక్టర్**

శ్రీకాళహస్తి పట్టణంలో పందుల స్వైర విహారానికి సంబందించి శానిటరీ ఇన్సెపెక్టర్ బాలను వివరణ కోరగా గత నెల తమిళనాడు నుంచి మనుషలను రప్పించి పట్టించటానికి ప్రయత్నించగా, వారి పందుల పెంపకందార్లు దాడి చేసి 9మందిని ఆసుపత్రి పాల్జేసి భయభ్రాంతుల్ని చేసారన్నారు. వారిని పెంచు కొనుటకు డపింగ్ యార్డులో నీటి సదుపాయం కల్పిస్తామని కూడా చెప్పినట్లు వివరణ ఇచ్చారు.

## రేపు కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం -నేడు విఐపి బ్రేక్‌దర్శనాల సిఫార్సులు తేవద్దు

తిరుమల,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రేపు మంగళవారం ఉదయం నిర్వహిస్తున్నారు. అనంతరం స్వామివారికి అలంకరణ చేసి ప్రత్యేక నివేదనలు పూర్తయిన వెంటనే భక్తులను దర్శనానికి అనుమతినిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు.నేడు విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు.

## పరశురామేశ్వరాలయాన్ని పరిశీలించిన పురావస్తుశాఖ అధికారులు



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 5 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవ దివ్యక్షేత్రం గుడిమల్లంలోని పరశురామేశ్వరాల యాన్ని ఆదివారం పురావస్తు శాఖ కేంద్ర కమిటి అధికారులు పరిశీలించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయం నేటికీ పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉంది. ఈ ఆలయానికి సంబంధించి మరమ్మత్తులకు సంబంధించి అధికా రుల బృందం పరిశీలించింది. ఆలయం ఉపరితల భాగం గోపురాలను పరిశీలించారు. అతి పురా తనమైన ఈ ఆలయానికి సంబంధిం చిన అభివృద్ధిపై స్థానిక ధర్మకర్తల మండలి ఛైర్మెన్ బత్తల గిరిబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డిలు అభ్యర్థించారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుంది. అంతేకాక హుండీ ఆదాయాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ముఖ్య పర్యాటక శాఖ ప్రత్యేక బస్సులను కూడా నడుపుతుంది. కానీ సరైన రోడ్డు మార్గం లేదు. ఈ అంశాలకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం స్పందించింది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పురావస్తు,పర్యాటక శాఖలకు అభ్యర్థించారు. ఆలయాభివృద్ధికి సంబంధించి న్యూఢిల్లి వెళ్ళినపుడు పర్యాటకశాఖతో పాటు సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు.ఈ నేపథ్యంలో ఆదివారం కేంద్ర పురావస్తు శాఖ అధికారులతో పాటు రాష్ట్ర శాఖ సూపరింటెండెంట్,డిఇ, చంద్రగిరి పురావస్తు శాఖ సర్కిల్ సిఐ బాలకృష్ణారెడ్డిలు పర్యటించారు. వారికి ఆలయ ఛైర్మెన్ గిరినాయుడు అర్చకులు,ఇఓ రామచంద్రారెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. ఇక్కడి పరిస్థితిని ఆలయ వాతావరణం, నిర్మాణాలకు సంబంధించి పరిశీలించారు. ఆర్డి ఎన్‌కె పతాక్, రాష్ట్ర సూపరింటెండెంట్ గోపినాథ్‌లు, చంద్రగిరి శాఖ సిఐ బాలకృష్ణారెడ్డికి పలు సూచనలు చేసారు.

## రామచంద్రకట్టపైకి గోవిందరాజస్వామి



తిరుపతి(రవాణ),జనవరి 5ప్రభాతవార్త: గోవిందరాజ స్వామి ఆలయంలో వారంరోజులుపాటు జరిగే ఆండాళ్ నీరాటోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం గోవిందరాజస్వామి రామచంద్రపుష్కరిణి కట్టపైకి వేంచేపుచేశారు. ఈనెల 6నుండి 12వతేదీ వరకు ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాల ఏర్పాట్లును పర్యవేక్షించేందుకు స్వామి ముందుగా ఊరేగింపుగా వెళ్ళవం ఆనవాయితీ. సాయంత్రం 6గంటలవరకు కార్యక్రమం జరిగింది. నేటినుండి ప్రతిరోజూ ఉదయం 5.30గంటలకు ఆండాళ్ అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి నగరంలో వీధుల నుండి రామచంద్రకట్టపై నీరాడమండపం చేరుకుంటారు ఇక్కడ పూజాకార్యక్రమాలు అనంతరం అమ్మవారు ఆలయానికి తిరిగి చేరుకుంటారు. ఏడురోజులు ఇలాగే జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పాతార్కాడు వాసులు మృతి



విజయపురం, జనవరి 5 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలోని పాతార్కాడు ఆది ఆంధ్రవాడకు చెందిన ఇద్దరు తండ్రి అంకయ్య(27), కూతురు మోక్షిత(4) మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... మృతుడు అతని భార్య, ఇద్దరు పిల్లలతో కలసి శనివారం రాత్రి 8 గంటలప్రాంతంలో సమీపంలోని తమిళనాడు రాష్ట్రం కనకమ్మసత్రంకు కిరాణ సామగ్రి, కూరగాయలు తీసుకురావడానికి ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తమిళనాడు రఘునాథపురం వద్ద ఎదురుగా చెన్నై వైపు వస్తున్న ఈచర్ వాహనం ఢీకొనడంతో అంకయ్య, మోక్షితకు తీవ్ర గాయాలై చెన్నై జీహెచ్‌కు తరలించగా మార్గమధ్యంలో మోక్షిత చనిపోయింది. అంకయ్య చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య రమ్య, కుమార్తె పూర్ణిమ స్వల్ప గాయాలై చికిత్స పొందుతున్నారు.

## అమ్మవారి సేవలో ప్రముఖ మాజీ క్రికెటర్ కృష్ణమాచారి



తిరుచానూరు, జనవరి 5, ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ప్రముఖ మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఆయనను ఇంచార్జ్ సూపరింటె ండెంట్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ముందుగా ద్వజస్థంభాన్ని నమస్కరించారు. అనంతరం అమ్మవారి ప్రత్యేక దర్శనంలో పాల్గొన్నారు. తరువాత ఆశీర్వాద మండపం వద్ద తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ వెలుపల మాజీ క్రికెటర్ అధికారికి తాను సంతకం చేసిన క్రికెట్ బ్యాట్ ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.